RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

మేడ్చల్ మల్కాజ్‌గిరి సంపుటి : 3 సంచిక : 268 గురువారం 23 అక్టోబర్ 2025 పేజీలు : 4 వెల : రూ. 2.00

## రైతులకు భారీ షాక్.. పెరగనున్న యూరియా ధరలు!

న్యూఢిల్లీ : ఇటీవల యూరియా దొరకక ఇబ్బందులు ఎదుర్కొన్న రైతులకు మరో షాక్ తగలనుంది. రబీ సీజన్ ప్రారంభానికి ముందే దేశంలో ఎరువుల ధరలు పెరిగే పరిస్థితి కనిపిస్తోంది. యూరియాతో పాటు కొన్ని రకాల ఎరువుల ఎగుమతులను ఈ నెల 15 నుంచే చైనా నిలిపివేసింది. ఈ నిర్ణయం భారత్ సహా ప్రపంచవ్యాప్తంగా వ్యవసాయ రంగంపై దుష్ప్రభావం చూపే అవకాశం ఉంది. ఈ నిలిపివేత 5 నుంచి 6 నెలల పాటు కొనసాగే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. మనం ఉపయోగించే టెక్నికల్ మోనో అమ్మోనియం ఫాస్ఫేట్ (టీఎమ్ఏపీ), అడ్‌బ్లూతో పాటు యూరియా, డీఏపీ వంటి ఎరువులను దాదాపు 95 శాతం చైనా నుంచే దిగుమతి చేసుకుంటున్నాం. ఇప్పుడు చైనా ఆంక్షలతో వీటి ధరలు మరో 10–15 శాతం పెరిగే అవకాశం ఉంది.




# హీటెక్కిన జూబ్లీహిల్స్ బైపోల్....

# అసలు ఘట్టం మొదలైంది!

## ప్రధాన పార్టీల నేతలు రెడీ...!!

హైదరాబాద్ : తెలంగాణలో జూబ్లీహిల్స్ ఉపఎన్నికకు సంబంధించి మరో అంకం మొదలైంది. మంగళవారంతో నామినేషన్లు ముగిసింది. దీంతో ప్రచారానికి రెడీ అవుతున్నాయి రాజకీయ పార్టీలు. ఇప్పటికే పార్టీలు స్టార్ క్యాంపెయినర్లను ప్రకటించాయి. దీంతో ఒక్కసారిగా ఉప ఎన్నిక వేడి తారాస్థాయికి చేరింది.

**వేడెక్కిన జూబ్లీహిల్స్ బైపోల్...** జూబ్లీహిల్స్ బైపోల్‌లో నామినేషన్ల ఘట్టం ముగిసింది. దీంతో రాజకీయపార్టీల నేతలు ఏయే రోజుల్లో ప్రచారం చేయాలన్న దానిపై ఆయా నేతలు చర్చించుకుంటున్నారు. బుధవారం నుంచి అధికార కాంగ్రెస్ పార్టీ స్టార్ క్యాంపెయినర్లలో ఎక్కువ మంది ప్రచారాన్ని ప్రారంభించనుంది.

గతంలో మాదిరిగా ఈసారీ ఇంటింటి ప్రచారం చేయాలని భావిస్తోందట. సీఎం రేవంత్ రెడ్డి నవంబర్ మొదటివారంలో ప్రచారంలోకి వచ్చే అవకాశమున్నట్లు గాంధీభవన్ వర్గాలు చెబుతున్నాయి. దీనికి సంబంధించి ఇప్పటికే రోడ్ మ్యాప్ సిద్ధమైనట్టు తెలుస్తోంది. ఇంకోవైపు మంత్రులు, పార్టీ కార్యకర్తలు జోరుగా ప్రచారం చేస్తున్నారు. జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇచ్చిన AIMIM అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ వివిధ ప్రాంతాల్లో ప్రచారం చేపట్టారు.

**ప్రచారంలోకి దిగనున్న ప్రధాన పార్టీల నేతలు...** ఉప ఎన్నికలు ప్రతిష్టాత్మకంగా తీసుకుంది బీఆర్ఎస్. సిటీలో తమకు పట్టు ఉందని నిరూపించుకునే ప్రయత్నం చేస్తోంది. అందుకోసం రకరకాల ఎత్తుగడలు వేస్తోంది. గ్రేటర్ హైదరాబాద్‌లోని నేతలు జూబ్లీహిల్స్‌లో సుడిగాలి పర్యటనలు చేస్తున్నారు. తాము విజయం సాధిస్తామని నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. మాజీ సీఎం కేసీఆర్ ప్రచారంలోకి దిగితే తమకు సానుకూల ఫలితాలు వస్తాయని కొండంత ఆశలు పెట్టుకుంది బీఆర్ఎస్. 2023లో జరిగిన ఎన్నికల్లో పాతిక వేల ఓట్లు సాధించింది బీజేపీ. ఈసారి మాత్రం సీటుపై కన్నేసింది. ఇందుకోసం స్టార్ క్యాంపెయినర్లను బరిలోకి దించింది. రెండువారాలపాటు జోరుగా ప్రచారం చేసి సీటు కాకున్నా, కనీసం సెకండ్ ప్లేస్‌లో నిలవాలని ఆలోచన చేస్తోంది. అదే జరిగితే సిటీపై పార్టీకి పట్టు పెరుగుతుందని, వచ్చే ఎన్నికల నాటికి అధికారంలోకి రావచ్చని భావిస్తోంది. ఆ పార్టీ కీలక నేతలు వివిధ ప్రాంతాల్లో ప్రచారం చేస్తున్నారు. ఇలా ఎవరికివారు నేతలు ప్రచారంలో నిమగ్నం కానున్నారు. ప్రత్యర్థులను ఇరుకున పెట్టేందుకు ఎలాంటి వ్యూహాలను అవలంభించాలనే దానిపై ఓ వైపు జోరుగా మంతనాలు సాగిస్తున్నారు. దాదాపు రెండువారాలపాటు జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో మైకులు రీసౌండ్ చేయనున్నాయి. జూబ్లీ హిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికకు భారీగా నామినేషన్‌లు దాఖలు అయ్యాయి. చివరి రోజు మంగళవారం (నిన్న) ఒక్కరోజు 117 మంది అభ్యర్థులు 194 నామినేషన్లు దాఖలు వేశారు. ఉప ఎన్నికకు మొత్తం 211 మంది అభ్యర్థులు 321 నామినేషన్లు దాఖలు చేశారు. రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో ఇవాళ నామినేషన్లను పరిశీలించనున్నారు ఎన్నికల అధికారులు. నామినేషన్లల ఉపసంహారణకు ఈనెల 24తో గడువు ముగియనుంది. నవంబర్ 9న ప్రచారం ముగియనుంది. నవంబర్ 11న పోలింగ్ జరుగుతుంది. మంగళవారం నామినేషన్లు దాఖలు చేసినవారిలో రీజనల్ రింగ్ రోడ్డు, ఫార్మాసిటీ భూనిర్వాసితులు, నిరుద్యోగులు భారీగా ఉన్నారు. దాదాపు 11 మంది రైతులు తమతమ నామినేషన్‌లు దాఖలు చేశారు. అలాగే ఎస్సీ వర్గీకరణను నిరసిస్తూ మాల సంఘాల జేఏసీ నుంచి 30 మంది నామినేషన్‌లు దాఖలయ్యాయి. రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమ సంఘం నుంచి 11 మంది నామినేషన్‌లు చేశారు. వివిధ వర్గాలు ప్రజలు భారీగా నామినేషన్లు దాఖలు చేయడంతో ప్రధాన పార్టీలకు వణుకు మొదలైంది. ఎక్కువ మంది బరిలో ఉంటే ఎలాంటి గుర్తులు కేటాయిస్తారోనన్న ఆందోళన వ్యక్తమవుతోంది.




## బకాయిలు అడిగితే బ్లాక్ మెయిలా.. ప్రభుత్వంపై బండి సంజయ్ ఆగ్రహం

హైదరాబాద్: ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై రాష్ట్ర ప్రభుత్వ వైఖరి సరికాదని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. హైదరాబాద్ నల్లకుంటలోని శంకర మఠాన్ని సందర్శించిన అనంతరం ఆయన మాట్లాడారు. పెండింగ్ ఫీజులన్నీ చెల్లించేవరకు విద్యాసంస్థలకు అండగా ఉంటామన్నారు. ప్రభుత్వ ఒత్తిడికి విద్యాసంస్థల యాజమాన్యాలు లొంగవద్దని సూచించారు. వాయిదా పద్ధతుల్లో చెల్లింపులకు అంగీకరించవద్దన్నారు. ప్రభుత్వాన్ని బకాయిలు అడిగితే విజిలెన్స్ దాడులతో బ్లాక్‌మెయిల్ చేస్తారా అని ప్రశ్నించారు. “బిహార్ ఎన్నికలకు డబ్బులు ఇక్కడి నుండే పంపుతున్నారు కదా.. విద్యార్థుల భవిష్యత్తు కోసం బకాయిలు చెల్లించలేరా? తక్షణమే వాటిని చెల్లించాలి. లేనిపక్షంలో తీవ్ర పరిణామాలు తప్పవు. విద్యార్థులు, యాజమాన్యాలతో కలిసి మంత్రులను రోడ్లపై తిరగనీయం.

జూబ్లీహిల్స్ ఉపఎన్నికలకు సంబంధించి భారత రాష్ట్ర సమితి, కాంగ్రెస్ పార్టీలపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉంది. గత పదేళ్ల భారత రాష్ట్ర సమితి పాలన, ప్రస్తుత కాంగ్రెస్ హయాంలో ఈ నియోజకవర్గానికి ఒరిగిందేమీ లేదు. జూబ్లీహిల్స్‌లో భాజపా గెలవడం ఖాయం” అని బండి సంజయ్ తెలిపారు.

## నేడు తెలంగాణ కేబినెట్ సమావేశం.. కీలక ప్రకటన చేసే ఛాన్స్!

హైదరాబాద్ : సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన రేపు తెలంగాణ మంత్రి వర్గం సమావేశం కానుంది. మధ్యాహ్నం 2 గంటలకు సచివాలయంలో ఈ సమావేశం జరగనుంది. కాగా రేపు జరగబోయే కేబినెట్ సమావేశంలో బీసీ రిజర్వేషన్లపై రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులు, సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు నేపథ్యంలో స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు భవిష్యత్ కార్యాచరణపై కేబినెట్ చర్చించనుంది. దీంతో ఇటీవల భేటీలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఇద్దరు పిల్లల నిబంధన ఆర్డినెన్సు కు రేపు మంత్రివర్గం ఆమోదం తెలపనుంది. అలాగే, SLBC పునరుద్ధరణ పనులు, %బా=న్రా% రెండో దశకు రాంరెడ్డి దామోదర రెడ్డి పేరు, కాళేశ్వరం పునరుద్ధరణ సహా పలు ప్రాజెక్ట్ పనుల పై మంత్రి వర్గం చర్చించనున్నట్లు సమాచారం.

**మరో పథకానికి శ్రీకారం?..** స్థానిక సంస్థల ఎన్నికలపై రేపు జరిగే సమావేశంలో మంత్రి వర్గం తుది నిర్ణయం తీసుకోనుంది. పాత పద్ధతిలో ఎన్నికలకు వెళ్లాలా? లేదా 42 శాతం రిజర్వేషన్లతో వెళ్లాలా? అనేది దానిపై కేబినెట్ చర్చించనుంది.




కాగా ఇప్పటికే ఈ రిజర్వేషన్ల అంశంపై రాష్ట్ర ప్రభుత్వం న్యాయనిపుణ్యులతో ఒక కమిటీ ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఈ కమిటీ ఇచ్చే నివేదిక ఆధారంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ల అంశాన్ని న్యాయస్థానాల్లో కొట్లాడేందుకు రేవంత్ సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. మరో ఎన్నికల్లో మెజారిటీ స్థానాల్లో విజయం సాధించేందుకు.. ప్రజలను తమ వైపు తిప్పుకునేందుకు కాంగ్రెస్ సర్కార్ ఎన్నికల్లో ఇచ్చిన మరో హామీని అమలు చేయాలనే ఆలోచనలో ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. ఇంతకు ఏ పథకం అమలు చేస్తారన్న దానిపై ఇంకా క్లారిటీ రాలేదు. అయితే రేపు రాష్ట్ర మంత్రి వర్గం ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటుదనేది వేచి చూడాలి.

# అట్లుంటది మోదితోని..

## మారిన ట్రంప్ స్వరం!

# టారిఫ్‌లు దిగిరానున్నాయా...!?




జరిగింది చెబుతాము, జరబోయేది చెబుతాము అన్నట్లుగా భారత్ తీసుకునే నిర్ణయాలు, చేసే పనుల విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ జాతకాలు చెప్పినట్లుగా మాట్లాడుతున్నారు. రష్యా నుంచి చమురు కొనుగోలు విషయంలో ఇప్పటికే చాలా సార్లు మాట్లాడిన ట్రంప్.. ఈ సారి మాత్రం స్వరం కాస్త మార్చారు.. ఫ్యూచర్ టెన్స్ లో మాట్లాడారు. ఈ సందర్భంగా మోడీపై ప్రశంసలు కురిపించారు. అవును... అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్ ను ఉద్దేశిస్తూ మరోసారి కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రధాని నరేంద్ర మోడీని ప్రస్తావిస్తూ కూడా కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ క్రమంలో రష్యా చమురు కొనుగోళ్ల విషయంపై స్పందిస్తూ... ఆ దేశ చమురు కొనుగోళ్లను భారత్ నిలిపివేసిందంటూ గతంలో ప్రకటించిన ఆయన... తాజాగా భారత్ పెద్ద మొత్తంలో చమురు కొనబోదంటూ వ్యాఖ్యానించారు. మొన్నటివరకు రష్యా నుంచి చమురు కొనుగోళ్లను భారత్ నిలిపివేసిందంటూ స్వయంగా ప్రకటించేసిన ట్రంప్.. తాజాగా మాట్లాడుతూ.. రష్యా నుంచి భారత్ భారీగా చమురు కొనబోదని వ్యాఖ్యానించారు. అందుకు కారణం... తనలాగానే మోడీ కూడా ఉక్రెయిన్ – రష్యాల మధ్య యుద్ధం ముగియాలని కోరుకుంటున్నారని ట్రంప్ అన్నారు. అయితే.. దీనిపై భారత్ ఏమాత్రం స్పందించలేదు!

**వైట్ హౌస్ లో దీపావళి!:** స్థానిక కాలమానం ప్రకారం.. నిన్న వైట్ హౌస్ లో దీపావళి వేడుకలు నిర్వహించారు. ఇందులో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తో సహా కీలక అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భారతీయ – అమెరికన్లకు ట్రంప్ దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. తనకు భారతీయులంటే చాలా ఇష్టమని వ్యాఖ్యానించారు. ఈ క్రమంలో భారత ప్రధాని నరేంద్ర మోడీపై ప్రశంసలు కురిపించారు. ఇందులో భాగంగా... ఆయన గొప్ప వ్యక్తి అని, గొప్ప స్నేహితుడని కొనియాడారు. మోడీతో తాను ఫోన్ లో మాట్లాడినట్లు తెలిపారు. ఈ సందర్భంగా తమ మధ్య గొప్ప సంభాషణ జరిగిందని.. అనేక విషయాల గురించి తాము మాట్లాడుకున్నామని.. ప్రధానంగా వాణిజ్యం గురించి చాలాసేపు చర్చించామని.. ఆయనకు దానిపై చాలా ఆసక్తి ఉందని ట్రంప్ పేర్కొన్నారు. అయితే.. ట్రంప్, మోడీల ఫోన్ సంభాషణ గురించి భారత్ ఇప్పటివరకు ఎలాంటి ప్రకటన చేయలేదు.

**భారత్ – అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందం!:** భారత్ – అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందం అతిత్వరలో ఖరారయ్యే సంకేతాలు కన్పిస్తున్నాయని జాతీయ మీడియాలో కథనాలొస్తున్నాయి. ఈ ఒప్పందంతో భారత్ పై ట్రంప్ టారిఫ్ లు భారీగా దిగి రానున్నట్లు ఆ కథనాలు పేర్కొన్నాయి. ఈ క్రమంలో.. ప్రస్తుతం 50శాతం ఉన్న టారిఫ్ లు.. 15–16 శాతానికి తగ్గే అవకాశం ఉందని అంటున్నారు. మరోవైపు కేంద్ర ప్రధాన ఆర్థిక సలహాదారు వి. అనంత నాగేశ్వరన్ కూడా వాణిజ్య ఒప్పందం ఖరారుపై విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ ఒప్పందానికి సంబంధించి తన వద్ద ఎలాంటి ఇన్ సైడర్ సమాచారం లేదు కానీ... రాబోయే రెండు నెలలు లేదా అంతకంటే ముందే ఇరు దేశాలు సమస్యలను పరిష్కరించుకుని ఒప్పందంపై ఏకాభిప్రాయానికి వచ్చే అవకాశం ఉందని భావిస్తున్నట్లు తెలిపారు.

# సంపాదకీయం

## చైనా నియంత్రణ.. అమెరికా హెచ్చరిక.. వాణిజ్య యుద్ధంలో మరో కోణం

అమెరికా , చైనా మధ్య వాణిజ్య రంగంలో ఉద్రిక్తతలు గత కొన్ని సంవత్సరాలుగా విస్తరించాయి. ముఖ్యంగా టారిఫ్‌లు, వాణిజ్య అడ్డంకులు, సాంకేతిక ఆంక్షలు ఈ రెండు ఆర్థిక శక్తుల మధ్య ఘర్షణలకు కారణంగా నిలుస్తున్నాయి. ఇప్పుడు ఈ పోరాటం మరో కీలక రంగంలోకి అరుదైన అయస్కాంత లోహాల సరఫరాలో దారితీస్తోంది. చైనా ప్రపంచవ్యాప్తంగా ఈ అరుదైన లోహాల ఉత్పత్తిలో దాదాపు 70 శాతం, వాటి శుద్ధిలో 90 శాతం నియంత్రిస్తుంది. ఈ గణాంకం చైనా స్థాయి ప్రభావాన్ని స్పష్టంగా తెలియజేస్తుంది. అమెరికా పక్షాన ఈ ఆధిపత్యం తీవ్రమైన ఆందోళనకు దారి తీసింది. ఎందుకంటే ఇవి ఆధునిక సాంకేతికతలో, రక్షణ రంగంలో, హరిత శక్తి ఉత్పత్తిలో అత్యంత అవసరమైన మూల పదార్థాలు.

**అరుదైన అయస్కాంత లోహాలు – ఆధునిక సాంకేతికతకు వెన్నెముక...** ఈ లోహాల్లో ముఖ్యమైనవి నియోడైమియం , ప్రసోడైమియం , డిస్ప్రోసియం వంటి మూలకాలు. వీటి మిశ్రమాలతో తయారయ్యే “శాశ్వత అయస్కాంతాలు” రాబోయే టెక్నాలజీ విప్లవానికి మౌలిక భాగాలు. ఇవి ఎలక్ట్రిక్ వాహనాల మోటార్లలో, పవన విద్యుత్ టర్బైన్‌ల జనరేటర్లలో, కంప్యూటర్ హార్డ్ డిస్క్ డ్రైవ్‌లలో, స్పీకర్లు , హెడ్‌ఫోన్‌లలో విస్తృతంగా ఉపయోగిస్తారు. ఎలక్ట్రిక్ వాహనాలు బలమైన శాశ్వత అయస్కాంత మోటార్లతో అధిక సామర్థ్యం, తక్కువ శక్తి వినియోగాన్ని అందించడానికి ఈ లోహాలు కీలకం. డిఫెన్స్ రంగం: మిసైల్స్, ఫైటర్ జెట్లు, రాడార్లు, స్మార్ట్ బాంబుల్లో ఉపయోగించే సూక్ష్మ సెన్సార్లు.. మోటార్ల తయారీలో ఇవి తప్పనిసరి. వైద్య పరికరాలు: ఎంఆర్ఐ స్కానర్లు, పేస్‌మేకర్లు, హియరింగ్ డివైస్‌లలో రేర్ ఎర్త్ ఎలిమెంట్లు అనివార్యమైనవి.

**పారిశ్రామిక వినియోగాలు:** హై పర్ఫార్మెన్స్ మోటార్లు, రోబోటిక్ వ్యవస్థలు, పవర్ టూల్స్ వంటి రంగాల్లో కూడా ఇవి ప్రధాన స్థానం పొందాయి.

**చైనా వ్యూహం – వాణిజ్యానికి ఆయుధంగా అరుదైన లోహాలు**... చైనా తన ప్రభావాన్ని పెంచుకునే ప్రయత్నంలో ఈ అర్థవంతమైన వనరులను “ట్రంప్ కార్డ్” గా ఉపయోగించడం ప్రారంభించింది. అమెరికా చైనాపై టారిఫ్‌లు విధించిన నేపథ్యంలో బీజింగ్ ఈ అరుదైన లోహాల ఎగుమతులను పరిమితం చేసే ప్రయత్నాల్లో ఉంది. ఇది కేవలం వాణిజ్య సమస్య కాదు, భౌగోళిక రాజకీయ ప్రభావాన్ని పెంచే ఆలోచన. అమెరికా, యూరోప్, జపాన్ వంటి దేశాలు ఈ లోహాల సరఫరాలో చైనాపై ఆధారపడటం, చైనాకు వ్యూహాత్మక అధికారాన్ని ఇస్తోంది. చైనా ఈ లోహాలను సరఫరా చేయనంత మాత్రాన ఆధునిక చిప్‌లు, గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టులు, మిలిటరీ తయారీ లైన్లు ఆగిపోయే ప్రమాదం ఉంది. దీనిని అమెరికా పెద్ద హెచ్చరికగా తీసుకుంది.

**ప్రపంచ వ్యూహాత్మక మార్పులు...** అమెరికా ప్రభుత్వం ఇప్పటినుంచే ప్రత్యామ్నాయ సరఫరా గొలుసులను ఏర్పరచడానికి దూకుడుగా ప్రయత్నిస్తోంది. ఆస్ట్రేలియా, కెనడా, ఇండియా, వియత్నాం వంటి దేశాల్లో అరుదైన లోహాల గనులను అభివృద్ధి చేసేందుకు పెట్టుబడులు పెడుతోంది. అదేవిధంగా రీసైక్లింగ్ టెక్నాలజీ ద్వారా వాడిన పరికరాల నుంచి రేర్ ఎర్త్ మూలకాలను తిరిగి పొందే దిశగా పరిశోధన జరుగుతోంది.

**భవిష్యత్తు దిశ...** అరుదైన అయస్కాంత లోహాలు కేవలం వాణిజ్య విలువ కలిగిన వనరులు కావు. ఇవి సాంకేతిక ఆధిపత్యం, రక్షణ భద్రత, గ్రీన్ ఎనర్జీ భవిష్యత్తుకి మూలాధారం. ఈ వనరులపై చైనాకున్న పట్టు, ప్రపంచ సమతౌల్యాన్ని మార్చే శక్తిగా మారింది. అమెరికా , ఇతర దేశాలు ఈ ఆధారపడటాన్ని తగ్గించుకోవడమే కాక, స్వావలంబనకు దిశగా కదలడం అనివార్యం అవుతోంది. అనగా 21వ శతాబ్దపు “వాణిజ్య యుద్ధాలు” ఇకపై కేవలం టారిఫ్‌లతో కాకుండా, అరుదైన ఖనిజాల ఆధిపత్యంతో నిర్ణయించబడతాయనడం తప్పు కాదు.

## రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో సత్తా చాటిన సాంఘిక సంక్షేమ గురుకుల విద్యార్థిని విజయలక్ష్మి..

### తన గురువులు, తల్లిదండ్రులైన శ్రావణ్ కుమార్ దంపతుల సహకారంతోనే సాధించగలిగా... విజేత విజయలక్ష్మి.







జిల్లా బ్యూరో మేడ్చల్ మల్కాజ్గిరి (గరుడ వార్త) : లక్ష్యం ఉంటే అందుకు గురువులు, తల్లిదండ్రుల సహకారం తోడైతే తప్పక విజయం సాధించగలమని విద్యార్థిని విజయలక్ష్మి నిరూపించింది. విద్యార్థిని విజయలక్ష్మి వాలీబాల్ క్రీడలో ఉత్తమ ప్రతిభ కనబరుస్తుండడంతో, 69వ భారత పాఠశాల క్రీడల సమాఖ్య (స్టూడెంట్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా) రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీల్లో ఘట్కేసర్ మున్సిపల్ అంకుషాపూర్ లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల సైనిక కళాశాలలో ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని విజయలక్ష్మిని జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైంది. ఇందులో భాగంగా సోమవారం సంగారెడ్డి జిల్లా సదాశివపేట లో జరిగిన రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో రంగారెడ్డి జట్టు తరఫున ప్రాతినిధ్యం వహించిన విజయలక్ష్మి జట్టు విజేతగా నిలిచింది. దీంతో స్టూడెంట్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా వారు విజయలక్ష్మి జట్టుకు కప్పును అందజేశారు. అదేవిధంగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన విజయలక్ష్మి కి మెడలు, ప్రతిభాపత్రాన్ని అందించారు. రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో స్టూడెంట్స్ గేమ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అండర్ 19 విభాగంలో సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలకు మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకువచ్చిన విద్యార్థిని విజయలక్ష్మిని కళాశాల ప్రిన్సిపల్ జూపల్లి రేణుక, ఉపాధ్యాయులు, పిఇటి లు నవనీత, స్వప్నలు అభినందించారు. రాష్ట్రస్థాయి క్రీడల్లో పాల్గొని విజేతగా విజయలక్ష్మి నిలవడం అభినందనీయమని కళాశాల ప్రిన్సిపల్ జూపల్లి రేణుక అన్నారు. అలియాబాద్ వాస్తవ్యురాలైన విజయలక్ష్మి రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో విజయం సాధించడంపై ఆమె తల్లిదండ్రులైన శ్రవణ్ కుమార్ దంపతులను పలువురు అభినందించారు. ముఖ్యంగా ఆడపిల్లలను చదివిపించడంతోపాటు క్రీడల్లో సైతం ముందుండేలా తోడ్పాటున అందిస్తున్నందుకు శ్రవణ్ కుమార్ దంపతులను, గురువులను పలు రంగాల ప్రముఖులు అభినందించారు.

## బదిలీ అయిన తహసిల్దార్ కు వీడ్కోలు



శామీర్ పేట, అక్టోబర్ 22 ( గరుడ వార్త ) : బదిలీపై వెళ్లబోతున్న తాహసిల్దార్ కు ఘనంగా వీడ్కోలు పలికారు. మూడు చింతలపల్లి మండల తహసిల్దార్ వెంకట నరసింహారెడ్డి బదిలీపై వెళ్లగా బుధవారం కార్యాలయంలోని ఉద్యోగులు ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు.

ఈ సంద ర్భంగా తహసిల్దార్ మాట్లాడుతూ గత సంవత్సరంగా విధులు నిర్వహించానని, తనకు సహకరించిన ఉద్యోగులు, మండల ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు.


## అలుపెరుగని గొప్ప పోరాటం వీరుడు కొమురం భీం



శామీర్ పేట, అక్టోబర్ 22 ( గరుడ వార్త) : అలుపెరుగని గొప్ప పోరాటం వీరుడు కొమురం భీం మని కాంగ్రెస్ పార్టీ నాయకుడు అఫ్జల్ ఖాన్ అన్నారు. గోండు వీరుడు కొమురం భీం జయంతి సందర్భంగా బుధవారం మండల కేంద్రం శామీర్ పేట లో ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మహ్మద్ అఫ్జల్ ఖాన్ మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం, విముక్తి కోసం అలుపెరుగని పోరాటం చేసి రజ కార్లను గడగడ లాడించిన వీరుడు కొమురం భీం అన్నారు. తెలంగాణ లో నిజోడే ఘాట్ లో ఆయన చేసిన వీరోచిత పోరాట పటిమ చరిత్ర లో నిలిచి పోతుందని తెలిపారు. గోండు ప్రజల హక్కుల కోసం అవిశ్రాంతంగా పోరాటం చేసి చివరకు కుర్దు పటేల్ అనే వెన్ను పోటు దారుని కారణంగా తుది శ్వాస వదిలారని, ఆయన తెలంగాణ ప్రజల గుండెల్లో ఎప్పటికి గూడు కట్టుకుని ఉంటారన్నారు. ఆయన ఆశయాలను మరవరాదని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు పి నర్సింహా రెడ్డి, నాయకులు మహ్మద్ నిసార్ అహ్మద్ ఖాన్, రాజు, శన్ముఖ్ రావు, రాంబాబు, గణపతి నారాయ పాల్గొన్నారు.

## ప్రారంభమైన పవిత్ర కార్తీక మాస ప్రత్యేక పూజలు

శామీర్ పేట, అక్టోబర్ 22 ( గరుడ వార్త ) : పూర్వ ఉమ్మడి మండల పరిధిలో కార్తీక మాసం పూజలను బుధవారం ప్రారంభించారు. ఉమ్మడి శామీర్ పేట మండలంలోని తూంకుంట మునిసిపల్, అలియాబాద్ మున్సిపల్, మూడు చింతలపల్లి మున్సిపల్ పరిధిలోని వివిధ గ్రామాలలో కార్తీకమాసం ప్రత్యేక పూజలను బుధవారం ప్రారంభించారు. మండల కేంద్రం శామీర్ పేట లోని శ్రీ భవాని రామలింగేశ్వర స్వామి ఆలయంలో ప్రధాన అర్చకులు మురళీధర్ శర్మ ఆధ్వర్యంలో నెలరోజులపాటు గోత్రనామాలతో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. అలాగే శామీర్ పేట మండలం తూంకుంట మున్సిపాలిటీ పరిధిలోని శ్రీ గాయత్రీ మాక్షేత్రంలో కార్తీక మాసం సందర్భంగా ఉమామహేశ్వర స్వామికి ఆలయ వ్యవస్థాపకులు, వాక్





బ్రహ్మ, శిష్య జనోద్ధారక డాక్టర్ ఎస్ వి ఎల్ ఎల్ మూర్తి ఆధ్వర్యంలో అభిషేకాలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా ఉమ్మడి శామీర్ పేట మండలంలోని శైవ క్షేత్రాలలో కార్తీకమాస సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ గ్రామాలలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

## త్వరలోనే గౌరవెల్లి ప్రాజెక్టు పూర్తి చేసి పంటలకు నీళ్లిస్తాం: మంత్రి పొన్నం

సంగారెడ్డి: కపాస్ కిసాన్ మొబైల్ యాప్ ద్వారా పత్తి కొనుగోళ్లు చేస్తున్నట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో ఆయన సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. జిన్నింగ్ మిల్లు ఉన్న కొనుగోలు కేంద్రంలో తేదీ స్లాట్ ఇస్తారని చెప్పారు. పత్తికి ప్రస్తుతం రూ.8,100 మద్దతు ధర ఉందని చెప్పారు. రైతుల నుంచి వరి, మొక్కజొన్న కొనుగోలు



చేస్తామని వివరించారు. ఆయిల్‌పామ్, హార్టికల్చర్, సెరీకల్చర్ రైతులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. త్వరలోనే గౌరవెల్లి ప్రాజెక్టు పూర్తి చేసి పంటలకు నీళ్లు ఇస్తామని హామీ ఇచ్చారు.

**విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి...** విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మహాత్మా జ్యోతిరావు ఫులె గురుకుల పాఠశాలలపై అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి మాట్లాడారు. అన్ని పాఠశాలలు, కళాశాలలు 100 శాతం ఫలితాలు సాధించేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ప్రిన్సిపల్స్, సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రాంతీయ సమన్వయ అధికారులు పాఠశాలలు, కళాశాలల్లో ఆకస్మిక తనిఖీలు చేయాలని చెప్పారు. నిర్దేశిత ఆహార మెనూను కచ్చితంగా అమలు చేయాలని కోరారు.

## కేసీఆర్‌తో కేటీఆర్, హరీశ్‌రావు భేటీ

సిద్దిపేట: భారత రాష్ట్ర సమితి అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌తో మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు భేటీ అయ్యారు. ఎర్రవల్లిలోని ఫాంహౌస్‌లో ఈ సమావేశం జరిగింది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక రోడ్‌షోలు, ప్రచార వ్యూహాలతో పాటు తాజా రాజకీయ పరిణామాలపైనా వారు చర్చిస్తున్నట్లు సమాచారం.

పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేల అంశంపైనా చర్చ జరిగినట్లు తెలుస్తోంది. జూబ్లీహిల్స్‌లోని వివిధ ప్రాంతాల ఇన్‌ఛార్జ్‌లతో గురువారం కేసీఆర్ సమావేశం కానున్నారు. ప్రచార వ్యూహాలపై వారికి ఆయన దిశానిర్దేశం చేయనున్నారు.

# ఇంట్లో దుమ్ము.. ఆగని తుమ్ము

హైదరాబాద్: నగరంలోని చాలా మంది పిల్లల్లో అలర్జీలు ఎక్కువగా కనిపిస్తున్నట్లు వైద్యులు తెలిపారు. దవాఖానాకు వచ్చే ప్రతి 10 మంది పిల్లల్లో ఐదారుగురిలో ఈ లక్షణాలు ఉన్నాయని పేర్కొన్నారు. అలర్జిక్ రైనైటిస్, బ్రాంకైటిస్‌లు ఎక్కువ మందిలో ఇబ్బంది పెడుతున్నాయి. ఇంటా బయటా వాతావరణం అందుకు దోహదం చేస్తున్నాయి. చలికాలంలో మరింత పెరిగే అవకాశం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. పెద్దల్లో కూడా అలర్జీలు అలజడి సృష్టిస్తున్నాయి. తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. శరీరంలోని రోగ నిరోధక శక్తి గాలిలోని అలర్జీలకు అతిగా స్పందించడం ద్వారా సమస్యలు ఉత్పన్నమవుతాయి.

**లక్షణాలు...కారణాలు:** కళ్లు ఎర్రబడటం, తుమ్ములు, ముక్కు కారటం, ముక్కులో వాపు, ముక్కు దిబ్బడ, కళ్లచుట్టూ వాపు, కొన్నిసార్లు జ్వరం, ఛాతీ బరువుగా ఉండటం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, పిల్లికూతలు లాంటి లక్షణాలు ఉంటాయి. ఇంట్లో పెంపుడు జంతువులు ఉంటే...పిల్లలను వాటికి దూరంగా ఉంచాలి. వాటి జుట్టు, చర్మం నుంచి రాలే తెల్లని పదార్థం, పావురాలు, ఇంట్లో వేసే అగరబత్తుల పొగ, వంటల్లో వాడే ఘాటైన తాళింపులు, బాత్‌రూం శుభ్రం చేసే రసాయనాలు...కొన్ని రకాల ఆహార పదార్థాలు, పుప్పొడి, ఎయిర్ ప్యూరిఫయర్లు, ఇంట్లోకి గాలి, వెలుతురు రాకపోవడం అలర్జీలు పెరగడానికి కారణమని చెబుతున్నారు.

చిన్నారుల్లో అలర్జీల శాతం
అలర్జిక్ రైనైటిస్: 53.7
అలర్జిక్ బ్రాంకైటిస్: 62.9
అలర్జీతో వచ్చే కండ్లకలక: 5.5
ఆహార అలర్జీలు: 1.85

పరిశుభ్రమైన వాతావరణం ముఖ్యం
డాక్టర్ రమణప్రసాద్, సీనియర్ పల్మనాలజిస్టు, కిమ్స్

ఇంట్లో శుభ్రమైన వాతావరణం ఉండేలా చూడాలి. అగరబత్తుల పొగ, రూం ఫ్రెష్‌నర్లు, బాత్‌రూం క్లీనర్లు విచ్చలవిడిగా వినియోగించకూడదు. పెట్స్‌కు పిల్లలను దూరంగా ఉండాలి. దిండ్లు, బెట్‌షీట్ కవర్లు ఎప్పటికప్పుడు మార్చుకోవాలి. ఫ్రిజ్‌లోని చల్లటి పదార్థాలు, ఐస్‌క్రీమ్‌లకు దూరంగా ఉండాలి. కొందరు బాత్‌రూమ్‌లో సిగరెట్లు తాగుతుంటారు. ఇది కూడా ప్రమాదమే.

# పొలాల్లో రాళ్లు.. కర్షకుల కన్నీళ్లు

కామారెడ్డి: జిల్లాలో భారీ వర్షం సృష్టించిన బీభత్సం కర్షకులకు కన్నీళ్లని మిగిల్చింది. ఎక్కడ చూసినా పంట పొలాల్లో ఇసుక, రాళ్ల మేటలే కనిపిస్తున్నాయి. ఎవరి భూమి ఏదో తెలియని పరిస్థితి నెలకొంది. చెరువులు తెగిన ప్రాంతాల్లోని పొలాల్లో నడుం ఎత్తు ఇసుక, భారీ రాళ్లు కొట్టుకొచ్చాయి. కొందరి బోర్లు సైతం కొట్టుకుపోయాయి. ఆ భూములు సాగుకు ఉపయోగపడతాయా లేదా అన్న ప్రశ్న తలెత్తుతోంది.

**వరదలో కొట్టుకుపోయిన కష్టం**

జిల్లాలో సుమారు 49 వేలకు పైగా పంట నష్టం జరిగినట్లు వ్యవసాయశాఖ అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. మంగళవారం పలువురు రైతుల్ని 'ఈనాడు' పలకరించగా.. తమ కష్టంతో పాటు రూ.లక్షల పెట్టుబడిని వరద నీటిలో పోసినట్టు ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇసుకమేట వేసిన ప్రాంతాల్లో రైతులు కన్నీటి పర్యంతమవుతూ కనిపించారు. చెరువుల సమీపంలోని పొలాలు నామరూపాల్లేకుండా పోయాయి. రోడ్లు తెగి డాంబార్, కంకర కొట్టుకొచ్చాయి. పలువురి పశువులు కొట్టుకుపోయాయి.

**లింగంపేటలోనే 400 ఎకరాలు**

లింగంపేట మండలంలోనే సుమారు 400 ఎకరాలకు పైగా భూముల్లో ఇసుక మేటలు వేసింది. కొన్ని పొలాల్లో భారీ గుంతలు ఏర్పడ్డాయి. పంట నష్టం పక్కకు పెడితే మళ్లీ సాగు భూమిగా మార్చడానికి ఎంత ఖర్చు చేయాల్సి వస్తుందోనని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. కన్నాపూర్ గ్రామంలోని చౌదరి చెరువు



తెగడంతో దిగువన ఉన్న భూముల్లో కనుచూపు మేర భారీ రాళ్లు, ఇసుక మేట వేసింది.

**కౌలు రైతుల పరిస్థితి దయనీయం**

కౌలు రైతుల పరిస్థితి మరీ దయనీయంగా ఉంది. ప్రభుత్వాలు ఇచ్చే నష్టపరిహారం పెట్టుబడికి కూడా రాదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిన్న, సన్నకారు రైతులు సాగు చేసిన ఒకట్రెండు ఎకరాల్లో పంట నష్టపోయి కోలుకోలేని స్థితిలో ఉన్నారు. రాజంపేట, ఎల్లారెడ్డి, పిట్లం, దోమకొండ, పల్వంచ మండలాల్లో పంట నష్టం అధికంగా ఉంది.

**ప్రభుత్వమే ఆదుకోవాలి: మహేష్, కౌలురైతు, దోమకొండ**

'సొంత భూమి లేక 5.20 ఎకరాలు కౌలుకు తీసుకున్నా. రూ.3 లక్షలకు పైగా ఖర్చు చేశా. పంట మంచిగా ఏపుగా ఎదుగుతుందనుకునేలోపే భారీ వర్షం కురిసింది. రెండు ఎకరాలకు పైగా కొట్టుకుపోయి ఎడారిలా మారింది. మరోవైపు ఇల్లు కూడా పాక్షికంగా కూలింది. దిక్కుతోచని స్థితిలో ఉన్నా. ప్రభుత్వమే ఆదుకోవాలి.

**సర్వే కోసం తిరిగే ఓపిక లేదు: కుమ్మరి గోపాల్, లింగంపేట రైతు**

'3.20 ఎకరాల్లో పొలం వేశాను. రూ.2 లక్షలకు పైగా ఖర్చు అయింది. అకస్మాత్తుగా వరదలు రావడంతో పొలం నామరూపాల్లేకుండా పోయింది. సరిహద్దులు కూడా కనిపించడం లేదు. ఇప్పటికే పెట్టుబడిని కోల్పోయా. మళ్లీ భూ సర్వేల కోసం అధికారుల చుట్టూ తిరిగే ఓపిక లేదు. తలుచుకుంటేనే భయమేస్తోంది.'

# ఆపద వేళ ఆసరా.. కంటి పాపలా కాపలా



హైదరాబాద్: ఎన్నో పున్నములు చూశారు.. మరెన్నో జీవితాలను చక్కదిద్దిన ఆలుమగలు వృద్ధాప్యంలో ఒంటరిగా మిగిలిపోతున్నారు. ప్రయోజకులైన పిల్లలు.. ఆస్తిపాస్తులు.. బంధుగణం ఉన్నా పలకరింపులకు దూరమవుతున్నారు. నాలుగు అడుగులు వేయాలన్నా ఎవరో ఒకరి మీద ఆధారపడాల్సి వస్తోంది. ఈ నిస్సహాయతను ఆసరా చేసుకొని.. అయిన వాళ్లు.. చేదోడుగా ఉండేందుకు వచ్చిన పని వాళ్ల చేతిలో దాడులకు గురవుతున్నారు. కొన్నిసార్లు ప్రాణాలు కోల్పోతున్నారు. ఇటువంటి ఘటనలకు అడ్డుకట్ట వేయాలనే సంకల్పంతో నగర పోలీసు యంత్రాంగం సిద్ధమైంది.

**తొలి అడుగు విజయవంతం..**

ఉత్తర మండలం డీసీపీ సాధన రష్మి పెరుమాళ్ తమ పరిధిలో ఒంటరి వయోధికుల జాబితా సిద్ధం చేయించారు. తిరుమలగిరి, మారేడుపల్లి, కారా?నా పరిధిలో విశ్రాంత ఉద్యోగులు ఎక్కువగా ఉంటున్నట్టు గుర్తించారు. వారికి పోలీసు యంత్రాంగం సహాయ పడేందుకు ఉన్న మార్గాలను పరిశీలించారు. మూడు నెలల పాటు వారికి చేదోడుగా ఉంటూ వారికి ఎటువంటి అపాయం వాటిల్లకుండా చూడగలిగారు. వయోధికుల రక్షణకు చేపట్టిన చర్యలు ఇటీవల వీడియో కాన్ఫరెన్స్‌లో తెలుసుకున్న నగర సీపీ సజ్జనార్ దీన్ని నగర వ్యాప్తంగా అమలు చేసేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు.

**ఏటా 300కుపైగా కేసులు..**

అంబర్‌పేట్ పరిధిలో ఏడాది క్రితం వృద్ధ జంటను హత్య చేసిన నిందితులు ఎవరనేది ఇప్పటికీ ప్రశ్నార్థకంగానే మిగిలింది. తాజాగా హిమాయత్‌నగర్‌లో ఉంటున్న ఆనందరావు(86), అనసూయ(83) దంపతులకు సహాయకుడిగా వచ్చిన వ్యక్తి వారిపై దాడి చేసి విలువైన వస్తువులతో పారిపోయాడు. నగర పరిధిలో ఇలాంటి ఘటనలపై ఏటా 300లకు పైగా కేసులు నమోదు అవుతున్నట్టు అంచనా. వీటికి అడ్డుకట్ట వేయాలనే ఉద్దేశంతో నగర పోలీసులు కొత్త కార్యాచరణను సిద్ధం చేశారు. దీన్ని నగర వ్యాప్తంగా అమలు చేసేందుకు సీపీ వీసీ సజ్జనార్ పోలీసు అధికారులు, సిబ్బందికి దిశానిర్దేశం చేస్తున్నారు.


పోలీసు సాయం సానుకూల ఫలితం
సాధన రష్మిపెరుమాళ్, డీసీపీ, ఉత్తర మండలం

కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా విశ్రాంత ఉద్యోగులు, వృద్ధులు ఎక్కువగా నివసిస్తున్న మూడు ప్రాంతాలపై దృష్టి సారించాం. వారానికోసారి స్వయంగా పరిశీలిస్తున్నాం. పని మనుషులను నియమించుకునే ముందు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కౌన్సెలింగ్ ఇచ్చాం. వారి గురించి వాకబు చేసి సహాయం చేసే బాధ్యతలను సెక్టార్ ఎస్సైలకు అప్పగించాం. అత్యవసర సమయంలో స్పందించేందుకు చుట్టుపక్కల వారు ముందుకొచ్చారు.

**చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నాం**
శిల్పవల్లి, డీసీపీ, మధ్య మండలం

తల్లిదండ్రులను వేధించే వారిపై సీనియర్ సిటిజన్ యాక్ట్ ప్రకారం చర్యలు తీసుకుంటున్నాం. చిక్కడపల్లిలో మద్యం తాగొచ్చి తల్లులతో గొడవ పడుతున్న ఇద్దరు కుమారులపై కేసులు నమోదు చేశాం. సహాయకులుగా నియమించుకునే వారిలో నేరచరిత్ర ఉన్నవారిని ముందుగా గుర్తిస్తే ప్రమాదాలను అడ్డుకోవచ్చు.

# ఔషధ విభాగానికి చికిత్సేది?




కరీంనగర్ : ఈ నెల 7వ తేదీన కరీంనగర్ జిల్లా ఔషధ నియంత్రణ విభాగంలో పని చేస్తున్న సహాయ సంచాలకుడు (ఏడీ), డ్రగ్ ఇన్‌స్పెక్టర్ మెడికల్ దుకాణం ఏర్పాటుకు డబ్బులు తీసుకుంటుండగా అనిశా అధికారులు పట్టుకున్నారు. ఏడాదిన్నర కిందట ఇదే కార్యాలయంలో పని చేసే ఓ ఉద్యోగి కూడా ఇలాగే లంచం తీసుకుంటూ జైలు పాలయ్యారు. అప్పట్లో అధికారులు పట్టుబడకుండా కింది స్థాయి సిబ్బంది దొరికారు. ఇటీవల మాత్రం ఉన్నతాధికారులే దొరకడంతో ఈ శాఖలో ఉన్న అవినీతి జబ్బు తీరుపై తీవ్రస్థాయిలో చర్చ జరుగుతోంది.

**తనిఖీలు లేక..**

నాలుగు జిల్లాల్లో 2 వేలకుపైగా ఔషధ దుకాణాలున్నాయి. హోల్‌సేల్‌గా వీటిని విక్రయించే ఏజెన్సీలు 180 ఉన్నాయి. అయితే వీటిని ఎప్పటికప్పుడు తనిఖీ చేసే విధంగా సిబ్బంది మాత్రం అందుబాటులో లేరు. దీంతో గతేడాది కేవలం 27 కేసులే నమోదు చేయగలిగారు. కనీసం నెలకు రెండు కేసులు కూడా నమోదవలేదు. కరీంనగర్ జిల్లా కేంద్రంలో ఏడీ కార్యాలయం ఉండటంతో ఇక్కడ కచ్చితంగా ఇద్దరు ఇన్‌స్పెక్టర్లతోపాటు 8 మంది సహాయ సిబ్బంది ఉండాలి. ఇక్కడి ఏడీ 8 జిల్లాలను పర్యవేక్షించాల్సి ఉంటుంది. ఇక కొత్త జిల్లాల్లోనూ కలెక్టరేట్‌లలో తాత్కాలికంగా కార్యాలయాలు ఏర్పాటు చేసినా అందులో సిబ్బంది లేకపోవడంతో కార్యాలయం వెలుపల డీఐల ఫోన్ నంబర్లు మాత్రమే దర్శనమిస్తాయి. కొత్తగా సిబ్బందిని నియమించకపోతే ఇప్పుడున్న వ్యవస్థ మరింత నిర్వీర్యమయ్యే అవకాశముంది. ఈ విభాగానికి సరైన చికిత్స అందేవిధంగా వెంటనే ఉద్యోగులను పూర్తిస్థాయిలో నియమించి ఉన్నతాధికారుల పర్యవేక్షణ పెంచాల్సిన అవసరముంది.

**ముగ్గురు ఇన్‌స్పెక్టర్‌లే!** ఉత్తర తెలంగాణలోనే కీలకమైన ఉమ్మడి జిల్లాలో ఏటా కోట్లాది రూపాయల ఔషధాల వ్యాపారం సాగుతోంది. పెద్దఎత్తున ప్రైవేటు, ప్రభుత్వ ఆస్పత్రులున్న ఉమ్మడి కరీంనగర్‌లో నకిలీ మందుల మూలాలను, వ్యాపారుల ఆగడాలకు అడ్డుకట్ట వేసేందుకు పెద్ద మొత్తంలో సిబ్బంది ఉండాలి. కానీ ప్రస్తుతం ముగ్గురు డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు (డీఐ) మాత్రమే ఉన్నారు. పైగా పెద్దపల్లి జిల్లాకు చెందిన డీఐ కరీంనగర్ జిల్లా ఇన్‌ఛార్జిగా ఇటీవల బాధ్యతలు చేపట్టారు. జగిత్యాల, సిరిసిల్లల్లో మరో ఇద్దరున్నారు. ఇక కరీంనగర్ ఏడీ కార్యాలయంలో ఏడీ, డీఐ పట్టుబడటంతో ఒక జూనియర్ సహాయకుడు, ఒక అటెండర్ మాత్రమే ఉన్నారు. ఉన్న వీరిద్దరు క్షేత్రస్థాయి తనిఖీలకు వెళ్లే పరిస్థితి ఉండదు. జగిత్యాలలోని కార్యాలయంలో మరో జూనియర్ సహాయకుడున్నారు. ప్రస్తుతానికి మొత్తంగా డీఐలు మిగతా సిబ్బంది కలిపి ఆరుగురు మాత్రమే ఉన్నారు.

# నిర్మాణానికి రూ.కోట్లు.. నిర్వహణకు తూట్లు



కరీంనగర్ : స్వచ్ఛ సర్వేక్షణ్.. సఫాయిమిత్ర సురక్ష ఛాలెంజ్.. వాటర్ం ర్యాంకులు సాధించేందుకు దోహదపడిన భూగర్భ మురుగునీటి శుద్ధి కేంద్రం లక్ష్యం నెరవేరడంలేదు. రూ.76.50 కోట్లు వెచ్చించి నిర్మించగా.. నిర్వహణపై అధికారులు నిర్లక్ష్యంతో క్రమంగా మూలకు పడుతోంది. కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలో భూగర్భ మురుగు శుద్ధి కేంద్రాన్ని(యూజీడీ) నగర శివారులోని గోపాల్ చెరువు దగ్గర 38 ఎంఎల్‌డీల సామర్థ్యంతో ఏర్పాటు చేశారు. ప్రతి రోజు 2 ఎంఎల్‌డీల మురుగునీటిని శుద్ధి చేస్తున్నారు. మరమ్మతులు చేయకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. జల్ హీ అమృత్ కింద రూ.కోటి రావలసి ఉండగా, రూ.70 లక్షలు మంజూరయ్యాయి. మిగతా రూ.30 లక్షలు రావాల్సి ఉండగా, రెండు రోజుల కిందట కేంద్ర బృందం వచ్చి ప్లాంటును పరిశీలించింది. నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో అదే వీడియో చిత్రీకరణ చేసుకొని వెళ్లిపోయినట్లు తెలిసింది.

**సామర్థ్యం ఉన్నా.. కనెక్షన్లు ఏవీ?**

స్మార్ట్‌సిటీ ప్రాజెక్టులో భాగంగా కొత్తగా రోడ్లు వేసిన ప్రాంతాల్లో భూగర్భ డ్రైనేజీ పైపులైన్లు వేశారు. ఇంటి ముందు ఛాంబర్ వరకు ఉండగా కనెక్షన్లు ఇవ్వాల్సి ఉంటుంది. దీనికోసం ప్రత్యేక నిధులు కేటాయించినా వినియోగించుకోవడం లేదు. 40 వేల ఇళ్లకు కనెక్షన్ ఇచ్చి 38 ఎంఎల్‌డీ నీటిని తరలించి శుద్ధి చేసుకోవడానికి వీలుంది. అయితే కొన్ని ట్రంకు లైన్లు క్లియరెన్స్ లేదని అంటుండగా మిగతా ప్రాంతాల నుంచి మురుగును తరలించవచ్చు. ప్రస్తుతం మారుతీనగర్, కాపువాడ, హుస్సేనీపుర ప్రాంతాల నుంచి సుమారు 7 వేల ఇళ్ల నుంచి రెండు ఎంఎల్‌డీల నీటిని శుద్ధి చేస్తున్నారు.

**అయిదేళ్లుగా మూలనపడిన మోటార్లు**

మురుగునీటి శుద్ధి కేంద్రంలో మొత్తం అయిదు మోటార్లు పని చేయాల్సి ఉంటుంది.

మూడు 150 హెచ్‌పీ మోటార్లు ఉండగా, అయిదేళ్లుగా ఒకే దాంతో నడిపిస్తున్నారు. మిగతా రెండు పని చేయడం లేదు. రెండు 75 హెచ్‌పీ మోటార్లు ఉండగా అవి నడవటం లేదు.

శుద్ధి చేసిన నీటిని పరీక్షించేందుకు ల్యాబ్ లేదు. ప్లాంట్ పైనా పాకురు పట్టింది. పైపులు తుప్పు పడి చెడిపోతున్నాయి.

శుద్ధి చేసిన నీరంతా తిరిగి మురుగునీటిలోనే కలుస్తోంది. ఎరువు తయారు చేయడం లేదు.

మెరుగుపర్చేందుకు ప్రణాళికలు

డీపీఆర్ తయారు చేసి ఇచ్చేందుకు ఒక సలహా సంస్థను పిలిచాం. ఆ సంస్థ ప్రతినిధులు పరిశీలించారు. ఇందులో ఉన్న సమస్యలు ఏవిధంగా పరిష్కరించాలి? దీనిని మెరుగు పర్చి వినియోగంలోకి తీసుకు రావడానికి ప్రణాళికలు తయారు చేసి ఇవ్వాలని కోరాం. నివేదిక రాగానే చర్యలు తీసుకుంటాం. లచ్చిరెడ్డి, డీఈఈ, కరీంనగర్ నగరపాలక

# ముందు ఒక ముఠా.. వెనకాలే అసలు ఆట!

సత్తుపల్లి : సత్తుపల్లి నియోజకవర్గంలో ఇసుక దందా జోరుగా సాగుతోంది. అక్రమార్జనే ధ్యేయంగా ఏపీ, తెలంగాణకు చెందిన కొందరు ఏపీలోని కృష్ణా, గోదావరి నదుల నుంచి ఇసుకను సత్తుపల్లికి తరలిస్తున్నారు. వేంసూరు, సత్తుపల్లి, పెనుబల్లి మండలాల పోలీసుల దాడుల్లో లారీలు పట్టుబడుతున్నా ఏమాత్రం లెక్కచేయకుండా నిరంతరం ఇసుక దందా కొనసాగిస్తూనే ఉన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పేరుతో తరలిస్తున్న ఇసుకనూ ఇతర గుత్తేదార్లు, బిల్డర్లకు రవాణా చేస్తూ భారీగా సొమ్ము దండుకుంటున్నారు.

**అధిక లోడుతో ఇసుక తరలిస్తూ..**

30 టన్నుల సామర్థ్యం ఉన్న టిప్పర్లలో, లారీల్లో 50 టన్నుల వరకూ ఇసుక తరలిస్తున్న వాహనాలను ఇటీవల సత్తుపల్లి, వేంసూరులలో ఎంవీఐ దాడులుచేసి కేసులు నమోదు చేశారు. సత్తుపల్లి, పెనుబల్లి మండలాల్లో 8 లారీలపై కేసులు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. అధిక లోడుతో రోడ్లు సైతం శిథిలమవుతున్నాయి.

**అక్కడ 150.. ఇక్కడ 1300**

ఏపీలో ఇసుక టన్ను రూ.150కి కొనుగోలు చేస్తూ సత్తుపల్లి, చుట్టుపక్కల ప్రాంతాల్లో టన్ను రూ.1100 నుంచి రూ.1300 వరకు విక్రయిస్తున్నారు. అక్రమ వ్యాపారంలో లారీల యజమానులకు వినియోగదారులకు మధ్య దళారీలు పుట్టుకురావడంతో దందా మరింత పెరిగిపోయింది. దళారులు ఇసుక లారీలకు ఒక్కో ట్రిప్పునకు రూ.5వేల నుంచి రూ.6 వేల వరకు కమీషన్లు దండుకొంటున్నారు.



**వేంసూరు మీదుగా పలు దారుల్లో..**

ఏపీలోని విజయవాడ నుంచి ఇసుకను పలు మార్గాల ద్వారా వేంసూరు మీదుగా తరలిస్తున్నారు. అడపాదడపా వేంసూరు పోలీసులు కేసులు నమోదు చేస్తున్నా.. రవాణా ఆగడంలేదు. ఎక్కువగా రాత్రుళ్లు తరలుతున్న లారీలకు ఎస్కార్ట్‌గా కొందరు వ్యక్తులు ముందుగా ప్రయాణిస్తూ పోలీసులు లేరని నిర్ధారించాక రవాణా సాగుతోంది. కేసులు నమోదు చేస్తే పలుకుబడితో కొందరు తప్పించుకుంటున్నారన్న ఆరోపణలున్నాయి. పోలీసులు, టాస్క్‌ఫోర్స్ యంత్రాంగం కేవలం లారీలపైనే కాకుండా దళారీ వ్యవస్థనూ నిరోధించి ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవాలని పర్యావరణ ప్రేమికులు కోరుతున్నారు. సత్తుపల్లి సబ్‌డివిజన్ పరిధిలో ఇసుక అక్రమ రవాణాపై నిఘా ఉంచామని, అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీలు, టిప్పర్లపై పలుమార్లు కేసులు నమోదు చేశామని ఏసీపీ ఎ.రఘు తెలిపారు. ప్రస్తుతం పలు మార్గాల్లో గస్తీని పెంచి అక్రమ రవాణాను అడ్డుకుంటామన్నారు.

# రెండు దశాబ్దాల ఎదురుచూపులు

ఖమ్మం: పూర్తి మెట్ట ప్రాంతమైన కామేపల్లి, రఘునాథపాలెం మండలాల్లో చెరువులు నింపి సుమారు 3వేల ఎకరాల ఆయకట్టుకు నీరందిచేందుకు ఉద్దేశించిన బుగ్గవాగు ప్రాజెక్టు 20 ఏళ్లుగా కాగితాల్లోనే మగ్గుతోంది. ఉన్నత స్థాయిలో హైడ్రాలిక్ క్లియరెన్స్‌లు వచ్చినా ప్రాజెక్టు నిర్మాణం కొలిక్కిరావటం లేదు.

బుగ్గవాగు ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా గ్రావిటీ ద్వారా నీరు మళ్లించేందుకు కాలువలు తవ్వాలని, ఇందుకు భూసేకరణ చేయాలని గత ప్రభుత్వ హయాంలో అధికారులు ప్రతిపాదించారు. రూ.40 కోట్ల అంచనాతో టెండర్లు నిర్వహించారు. 25 కి.మీ. పొడవున కాలువలు తవ్వేందుకు సుమారు 100 ఎకరాలకు పైగా భూసేకరణ చేయాల్సి ఉండగా రైతులు అంగీకరించలేదు. భూములివ్వమని ఏజెన్సీలో గిరిజనులు ససేమిరా మొండికేశారు. ఈ నేపథ్యంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు భూసేకరణకు ప్రత్యామ్నాయంగా పైపులైన్లు నిర్మించి నీటిని తరలించే అవకాశాలు పరిశీలించాలని ఇటీవల ఆదేశించారు. భూమిలో పైపులైన్ నిర్మించి నీటిని మళ్లించేందుకు తాజాగా రూ.97 కోట్ల అంచనాతో ప్రతిపాదన రూపొందించి పంపించారు. **గత ప్రతిపాదనలు రద్దు..** గత ప్రభుత్వ హయాంలో టెండర్లు దక్కించుకున్న ఖమ్మంకు చెందిన గుత్తేదారు ఇటీవల ఒప్పందం రద్దు చేయాలని అధికారులకు లేఖ అందించారు. ఈ మేరకు నీటిపారుదల శాఖ అధికారులు నివేదిక పంపారు. ఇదే సమయంలో ప్రాజెక్టు నూతన ప్రతిపాదనలూ ప్రభుత్వానికి అందించారు. ఇప్పటికే ప్రాజెక్టు నిర్మాణానికి గతంలో మంజూరు చేసిన రూ.40 కోట్లు అందుబాటులో ఉన్నాయి.



**ప్రాజెక్టు స్వరూపం**

సింగరేణి మండలం గేట్ కారేపల్లి సమీపంలో బుగ్గవాగుపై చెక్‌డ్యాం నిర్మించాలి. అక్కడి నుంచి నీటిని కామేపల్లి, రఘునాథపాలెం మండలాల్లో 31 చెరువులకు మళ్లించటం ద్వారా సుమారు 3వేల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ అవుతుంది. కామేపల్లి మండలంలో పింజరమడుగు, నెమలిపురి, గోవింద్రాల, కొమ్మినేపల్లి, రఘునాథపాలెం మండలం కోటపాడు, పాపటపల్లి, కోయచెలక, శివాయిగూడెం, రఘునాథపాలెం, మంచుకొండ, బూడిదంపాడు తదితర గ్రామాల్లోని చెరువుల్లోకి నీటిని మళ్లిస్తారు. ఇందుకు 38 కి.మీ. పొడవైన పైప్‌లైన్ నిర్మించనున్నారు.

**ప్రధానంగా కామేపల్లికి..**

సాగునీటి వసతి లేని రఘునాథపాలెం మండలంలో మంచుకొండ ఎత్తిపోతల రూపంలో 30పైచిలుకు చెరువులకు సాగర్ నీరు అందించే పనులు కొలిక్కి వస్తున్నాయి. ఈ ఎత్తిపోతలలో లబ్ధి పొందే కొన్ని చెరువులు పూర్వ బుగ్గపాడు ప్రాజెక్టు పరిధిలో ఉన్నా రెండు పథకాల రూపంలో కరవు నేలకు రెండు పంటలా నీరందే అవకాశం ఉంది. అంతకంటే ముఖ్యంగా ఎలాంటి నీటి వనరులేని కామేపల్లి రైతులకు బుగ్గపాడు ప్రాజెక్టు ఎంతో అవసరం.

# పదేళ్ల ఉద్యమ ఫలితం

మల్లాపూర్: పదేళ్ల కిందట నష్టాల కారణంగా మూసివేసిన ముత్యంపేట చక్కెర పరిశ్రమను తిరిగి తెరిపించేలా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తుంది. ఈనెల 26న పరిశ్రమలు, వ్యవసాయశాఖ అధికారుల బృందం పరిశ్రమను సందర్శించి చెరకు రైతులతో సమావేశమై వారి అభిప్రాయాలను సేకరించనున్నారు. శుక్రవారం పరిశ్రమ పరిధిలో సమావేశం నిర్వహించేందుకు యంత్రాంగం అవసరమైన ఏర్పాట్లు చేస్తుంది. చెరకు రైతు ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో ఎంతమందిని పిలవాలి.. ఏ అంశాలపై చర్చించాలనే విషయాల్లో నిమగ్నమయ్యారు.

**కాంగ్రెస్ ఎన్నికల హామీ**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చెరకు ఉత్పత్తిలో రెండో స్థానంలో నిలిచిన ఈ పరిశ్రమను 2015 డిసెంబరు 23న నష్టాల కారణంగా అప్పటి ప్రభుత్వం మూసివేసింది. దీంతో ఈ ప్రాంత రైతులు పదేళ్లుగా ఉద్యమాలు చేస్తూ వచ్చారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ప్రభుత్వం తాము అధికారంలోకి వస్తే దీనిని తెరిపించడంతోపాటు మద్దతు ధరను టన్నుకు రూ.4 వేల వరకు కల్పిస్తామని హామీ ఇచ్చింది. దీంతో గతేడాది మంత్రి శ్రీధర్‌బాబు అధ్యక్షతన మంత్రుల బృందం పరిశ్రమను సందర్శించగా.. రైతుల అభిప్రాయ సేకరణకు అధికారుల కమిటీ రేపు రానుండటంతో రైతుల్లో ఆశలు చిగురుస్తున్నాయి.

**సాగు పెరిగితేనే మనుగడ**

పదేళ్లుగా పరిశ్రమను మూసివేసినప్పటికి జిల్లాలోని పలు మండలాలకు చెందినవారు చెరకును సాగు చేస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలో లక్ష



టన్నుల మేర పంట ఉత్పత్తి అవుతుంది. దీన్ని క్రషింగ్ నిమిత్తం కామారెడ్డికి తరలిస్తున్నారు. ముత్యంపేట చక్కెర పరిశ్రమ పునరుద్ధరణకు నోచుకుంటే కనీసం 3.5 లక్షల టన్నుల నుంచి 4 లక్షల టన్నుల మేర పంట సాగు చేయాల్సి ఉంటుంది. ఈ మేరకు సదరు చెరకు విత్తనం ప్రస్తుతం రైతులకు అందుబాటులోలేదు. దీన్ని యాజమాన్యం సమకూరిస్తే రైతులు ముంచుకొచ్చే అవకాశముంది.

**ప్రభుత్వ లేదా ప్రైవేటు**

పరిశ్రమ పరిధిలో జరిగే అధికారుల కమిటీ ఎదుట తమ అభిప్రాయాలు తెలియజేసేందుకు చెరకు రైతులు సన్నద్ధమవుతున్నారు. ఈ అభిప్రాయ సేకరణలో రైతులకు గిట్టుబాటు ధర, చెల్లింపులు, క్రషింగ్ బకాయిలు, హర్వేస్టింగ్, విత్తన సబ్సిడీతోపాటు పలు సమస్యలను కమిటీ ముందు ఉంచనున్నారు. పరిశ్రమను ప్రభుత్వ ఆధీనంలో నడిపించినా.. ప్రైవేటు భాగస్వామ్యంలో అయినా తమకు అభ్యంతరం లేదని పేర్కొంటున్నారు.

# తెగులు.. దిగులు

రాజపేట: పత్తి పంటను తెగుళ్లు చుట్టుముడుతున్నాయి. ఇటీవల వరుసగా కురుస్తున్న వర్షాలకు వేరుకుళ్లు, ఎండాకు తెగుళ్లు ఉద్ధృతమవుతోంది. వీటికితోడు కొన్ని ప్రాంతాల్లో మెగ్నీషియం ధాతువు లోపం కూడా కనిపిస్తుండటంతో అన్నదాతలు దిగులు చెందుతున్నారు. పంట మొక్కలు క్రమంగా చనిపోతుండటంతో పత్తి రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వివిధ రకాల మందుల కొనుగోళ్లు, పిచికారీకి అదనపు వ్యయం చేయాల్సి వస్తుందని రైతులు అంటున్నారు. వలిగొండ, ఆలేరు, మోత్కూరు, రాజపేట, ఆత్మకూర్(ఎం) ప్రాంతాల్లో ఈ సమస్య ఎక్కువగా ఉన్నట్లుగా తెలుస్తోంది.

**ప్రస్తుత పరిస్థితి ఇదీ..** అనువైన సమయంలో వానలు లేని కారణంగా ఎక్కువమంది రైతులు గతంలో కంటే పత్తిసాగుపైనే దృష్టి సారించారు. ప్రస్తుతం వర్షాలు పడుతున్న నేపథ్యంలో పంట ఏపుగా పెరుగుతోంది. రేగడి నేలల్లో వర్షపునీరు కమతాల్లో అలాగే నిల్వ ఉండటంతో తెగుళ్ల ప్రభావం ఎక్కువగా ఉంటోంది. వేరుకుళ్లు తెగులు వల్ల ఆకులు వంగిపోతున్నాయి. మొక్క అవలీలగా ఊడిరావడంతో పాటు వేర్లు నలుపురంగుకు మారుతున్నాయి. ఎండాకు తెగులు సోకిన పత్తి ఆకులు నేల రాలుతున్నాయి. కాండం మధ్యభాగం చామనచాయ రంగులోకి మారుతుండగా మొక్కలకు పోషకాల సరఫరాలేక ఎండిపోతున్నాయి. మెగ్నీషియం ధాతువు లోపం కారణంగా మొక్కలోని పత్రాలు ఎరుపుగా మారుతున్నాయి. దీనివల్ల మొక్కకు ఆహారం తయారు చేసుకునే శక్తి సన్నగిల్లి, క్రమంగా ఎండిపోతోంది.

**సస్యరక్షణ చర్యలు చేపట్టాలి..**

శాంతినిర్మల, ఏడీఏ, యాదగిరిగుట్ట

ప్రస్తుతం వర్షాలు ఎక్కువగా కురుస్తున్న నేపథ్యంలో పత్తిరైతులు సస్యరక్షణ చర్యలు తప్పకుండా పాటించాలి. వేరుకుళ్లు, ఎండాకు తెగుళ్ల నివారణకు మూడు గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్ మందును లీటరు నీటికి కలిపి ప్రభావిత ప్రాంతాల్లోనే మొక్క మొదళ్లలో పిచికారీ చేయాలి. ఆయా పంటలకు సోకుతున్న తెగుళ్ల నివారణకు స్థానికంగా వ్యవసాయాధికారులు, ఏఈవోలను సంప్రదించి నివారణ చర్యలు, ముందస్తు జాగ్రత్తలు పాటించాలి.

# ఆరోగ్య నగరం మన చేతుల్లోనే..

హైదరాబాద్: స్వచ్ఛ వాయు సర్వేక్షణ్‌లో మధ్యప్రదేశ్‌లోని ఇండౌర్ మొదటి స్థానంలో నిలిచింది. ఘన వ్యర్థాల నిర్వహణ, దుమ్ము నియంత్రణ, వాహనాలు, పరిశ్రమల ఉద్గారాల కట్టడి, లక్షలాది మొక్కలు నాటి పరిరక్షించడం, ఎలక్ట్రిక్, సీఎన్జీ బస్సుల వినియోగం తదితర చర్యల వల్ల వాయునాణ్యతలో ఆదర్శంగా నిలిచింది. స్వచ్ఛవాయు సర్వేక్షణ్‌లోనూ దానిదే మొదటిస్థానం. ఆరోగ్య నగరం కోసం ఈ విధానాలు మనమూ పాటించాలని నిపుణులు సూచిస్తున్నారు.

ఇండౌర్‌లో..15 ఏళ్లకు పైబడిన వాహనాలను తుక్కుగా మార్చడంలో నిబంధనల అమలుకాలుష్య నియంత్రణకు కేంద్రీకృత వ్యవస్థ

అటల్ ఇండౌర్ సిటీ ట్రాన్స్‌పోర్ట్ సర్వీసెస్ లిమిటెడ్ ద్వారా డీజిల్ బస్సులను సీఎన్జీగా మార్పు. 550 కొత్త సీఎన్జీ బస్సుల ప్రవేశం, 10 వేల సీఎన్జీ ఆటోలు, 400 టాక్సీలు, ఎల్పీజీ ఆటోలకే అనుమతి. ఎలక్ట్రిక్ ఆటోలకు ప్రోత్సాహకాలు. 63 వేల కార్లను సీఎన్జీ, ఎల్పీజీ వాహనాలుగా మార్పు.

5 చోట్ల మల్టీలెవెల్ పార్కింగ్‌లు.

రోడ్లపై దుమ్ము రాకుండా మెకనైజ్డ్ స్వీపింగ్ మెషీన్లతోపాటు స్ప్రేయింగ్ మెషీన్ల వినియోగం.

నిర్మాణ రంగాల వ్యర్థాల నిర్వహణకు ప్రత్యేక యాప్.

**నగరంలో ఇలా..**

వాహన కాలుష్య తనిఖీలను కేంద్రీకృత వ్యవస్థ ద్వారా పర్యవేక్షణ కార్యరూపం దాల్చలేదు. రెండేళ్లుగా ఇంధన కాలుష్య తనిఖీలు లేవు.

280 ఎలక్ట్రిక్ బస్సులు, మూడు వేలకు పెంచాలనే ప్రతిపాదన.

85 లక్షల వాహనాలు ఉండగా అందులో విద్యుత్తువి 1.8 లక్షలే.

కేబీఆర్ పార్కు, నాంపల్లి చౌరస్తా వద్ద బహుళ అంతస్తుల పార్కింగ్ సదుపాయం. మరో 30 చోట్ల నిర్మించాలనే ప్రతిపాదనలు38 స్వీపింగ్ మెషీన్ల వినియోగం. నీటిని చిమ్మే స్ప్రేయింగ్ యంత్రాలు లేవు.

# సాగు సర్వేలో జాప్యం



కరీంనగర్ : వానాకాలం పంటల సాగు నమోదులో మరింత వేగం పెరగాల్సి ఉంది. ఆగస్టు నెల ప్రారంభానికి ముందు నుంచే పంటల నమోదు కార్యక్రమాన్ని చేపట్టాలి. కానీ జిల్లాలో యూరియా కొరత, పంపిణీలో ఇబ్బందులు, పారదర్శకతకు సర్వే చేపట్టాల్సిన ఏఈవోలకు పంపిణీ బాధ్యతలు సైతం అప్పగించారు. జిల్లా వ్యాప్తంగా సర్వే ప్రారంభించడంలో జాప్యం జరిగింది. నాలుగైదు రోజుల నుంచి సాగు వివరాల నమోదు ప్రక్రియ ప్రారంభమైంది. ఈ సమయానికే సగం సర్వే పూర్తి కావాల్సి ఉండగా, మూడో వంతు కూడా పూర్తి కాలేదు. అయినా సమయం మించి పోలేదని, వచ్చే నెల రెండో వారంలోగా సాగు వివరాల్నింటిని ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేస్తామని వ్యవసాయ శాఖ అధికారులంటున్నారు.

**రైతుల ఇక్కట్లు** సరిపడా యూరియా అందుబాటులో లేక రైతులు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. ఈ సమయంలో అవసరమైన వారికి అందకుండా పక్కదారి పట్టే అవకాశముండడంతో దిద్దుబాటు చర్యలు చేపట్టారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, ఆగ్రోస్, డీసీఎంఎస్, రైతు ఉత్పత్తి కేంద్రాలు తదితర యూరియా విక్రయాల కేంద్రాల వద్ద పారదర్శకతకు ఏఈవోలకు బాధ్యతలు అప్పగించారు. దీనికితోడు రాయితీపై వ్యవసాయ యంత్ర పరికరాలు, రైతు బీమా దరఖాస్తులు తదితర పనులు సైతం చేపట్టాల్సి వచ్చింది. పంటల సాగు నమోదు తప్పనిసరి కావడంతో గత కొన్ని రోజుల నుంచి సర్వే ప్రారంభించారు. **వివరాల నమోదు ఇలా..**

వానాకాలంలో ఇప్పటి వరకు ప్రధాన పంటలు అయిన వరి 2,76,879 ఎకరాలు, పత్తి-44,875, మొక్కజొన్న-3,562 ఎకరాల్లో సాగు అయింది. మొత్తంగా అన్ని పంటలు కలిపి 3,25,955 ఎకరాల్లో సాగు కాగా, వివరాల నమోదు మాత్రం 93 వేల ఎకరాల్లో పూర్తి అయింది. మిగిలిన వివరాలు నమోదు చేయాల్సి ఉంది. కొన్ని చోట్ల సాంకేతిక కారణాలు, రైతులు అందుబాటులో లేకపోవడం తదితర కారణాలతో సాగు వివరాల నమోదు ఆలస్యం అవుతున్నట్లు తెలుస్తోంది.

**త్వరలోనే పూర్తి చేస్తాం**

యూరియా పంపిణీ దగ్గర ఏఈవోలకు బాధ్యతలు అప్పగించడంతో.. సర్వేలో కొంత జాప్యం జరిగింది. త్వరలోనే సాగు వివరాల నమోదు పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించాం. అందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నాం - జె.భాగ్యలక్ష్మి, జిల్లా వ్యవసాయాధికారిణి

# పరుగు.. పాలపొంగుల వైపు..!



భువనగిరి : గూడులేని నిరుపేదలకు ఇళ్లు నిర్మించాలని ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో యాదాద్రి భువనగిరి జిల్లా రాష్ట్రంలోనే ముందుంది. కలెక్టర్ హనుమంతరావు, జిల్లా అధికార యంత్రాంగం, స్థానిక ఎమ్మెల్యేల ప్రత్యేక చొరవతో ఇళ్ల నిర్మాణం వేగం పుంజుకుంటోంది. యాదాద్రి భువనగిరి జిల్లాలో మొత్తం 9,495 ఇళ్లు మంజూరయ్యాయి. ముగ్గులు పోసినవి 7,740 కాగా, ఇంకా పనులు ప్రారంభించనివి 1,755 ఉన్నాయి. ఆర్థిక ఇబ్బందుల కారణంగా పనులు ప్రారంభించలేకపోతున్నామని పలువురు లబ్ధిదారులు వాపోతున్నారు. ఆత్మకూరు(ఎం) మండలంలో 23 గ్రామపంచాయతీలకు మొదటి విడతలో 359 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయి. 33 మంది లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకోలేమని అధికారులకు లేటఖలు అందించారు. మిగతా 326 మంది ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించగా.. అందులో ఒకరు గృహ ప్రవేశం చేశారు. 56 మంది శ్లాబులు పూర్తి చేశారు. 226 మంది పునాదుల నుంచి లెంటల్ వరకు నిర్మించారు. మండలంలో బునాదిగాని కాల్వ పారుతుండటంతో ఇసుక తరలింపు నిలిచిపోయి నిర్మాణాలు కాస్త మందగించాయని అధికారులు వివరించారు. చౌటుప్పల్ పురపాలిక పరిధిలో 300 ఇందిరమ్మ ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేసింది. 203 మంది సొంతంగా ఇంటి నిర్మాణాలు ప్రారంభించారు. మహిళా స్వయం సహాయక సంఘాల ద్వారా రుణం ఇప్పించాలని కోరడంతో 30 మందికి రూ.లక్ష చొప్పున బ్యాంకుల నుంచి రుణం మంజూరు చేయించగా వారు ఇళ్ల నిర్మాణం చేపడుతున్నారు.

**ఉన్న ఇంటిని కూల్చివేసి...**


ఆలేరు మండలం కొలనుపాకకు చెందిన నమిల ఉషది నిరుపేద కుటుంబం. గ్రామ పంచాయతీలో పారిశుద్ధ్య కార్మికురాలు. భర్త, ఇద్దరు సంతానం. మూడు నెలల క్రితం కుమార్తెకు పెళ్లి చేసింది. అనంతరం వారం రోజులకే ఇందిరమ్మ ఇల్లు మంజూరైంది. రేకుల ఇంటిని కూల్చివేసి ఇంటికి నిర్మాణానికి ముగ్గు పోసింది. అప్పుపుట్టక పోవడంతో ఇంటి నిర్మాణం నేటికీ 'ముగ్గు'కే పరిమితమైంది.

**జిల్లా వివరాలు...**

మంజూరైన ఇళ్లు : 9,495
ముగ్గులు పోసినవి : 7,740
పునాదులు పూర్తయినవి : 5,049
రూఫ్ లెవల్‌లో ఉన్నవి : 911
రూఫ్ లెవల్ దాటినవి : 248
పూర్తయిన ఇళ్లు : 10
ప్రారంభించనివి : 1,755

**రాష్ట్రంలో అగ్రస్థానంలో ఉన్నాం** విజయ్‌సింగ్ (పీడీ, యాదాద్రి భువనగిరి జిల్లా) ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో రాష్ట్రంలోనే జిల్లా అగ్రస్థానంలో ఉంది. నిర్మాణాలతో పాటు చెల్లింపుల్లో కూడా ముందంజలో ఉన్నాం. ప్రభుత్వ లక్ష్యం మేరకు ఇళ్ల నిర్మాణాన్ని సకాలంలో పూర్తి చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం.

# కార్యాలయాల కేంద్రంగా ధరూర్‌క్యాంపు




జగిత్యాల: ధరూర్‌క్యాంపు శ్రీరామసాగర్ జలాశయం పరిధి జగిత్యాలలోని ధరూర్‌క్యాంపు స్థలాలు ప్రస్తుతం ప్రభుత్వ కార్యాలయాలకు నెలవుగామారి పట్టణానికి కొత్తశోభను తెచ్చాయి. 1963లో నెహ్రూ చేతులమీదుగా శ్రీరామసాగర్ ప్రాజెక్టు నిర్మాణం ప్రారంభంకాగా.. తదుపరి ప్రాజెక్టు పరిధిలోని చాలా ప్రాంతాల్లోనూ స్థలాలు సేకరించారు. ఈ క్రమంలో పట్టణ, ధరూర్ గ్రామ శివారులోని రైతులు, స్థానికులనుంచి 250 ఎకరాల వరకు స్థలాన్ని సేకరించి ధరూర్‌క్యాంపు పేరిట ప్రాజెక్టు పరిపాలన భవనాలు, అధికారులు, సిబ్బంది నివాస గృహాలను నిర్మించారు. ప్రభుత్వం అన్ని నీటి పారుదల అనుబంధ శాఖలను విలీనంచేసి జగిత్యాలలోని ధరూర్‌క్యాంపులోనే సీఈ, ఎస్ఈ, ఈఈల కార్యాలయాలను ఏర్పాటుచేశారు.

ధరూర్‌క్యాంపులో గతంలోనే బస్‌డిపో, గోదాములు, ఆగ్రోస్, విద్యుత్తు కేంద్రం, సబ్ డివిజన్ పోలీసు, రూరల్‌ఠాణా, న్యాయమూర్తుల నివాసగృహాలు, రిజిస్ట్రేషన్ కార్యాలయం, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ భవనం, వాటర్ పంపింగ్ స్టేషన్, రెండు విద్యార్థుల వసతిగృహాలు, ఎస్సారెస్పీ, ఆర్‌అండ్‌బీ అతిథి గృహాలు, కేజీబీవీ, వాల్మీకీ ఆవాసం, ఉన్నత పాఠశాల తదితరాలను నిర్మించారు.

నర్సింగ్ కళాశాల, ప్రభుత్వ ఐటీఐ, పోలీసు శిక్షణ కేంద్రం ఏర్పడగా.. ఐఎంఏ భవన్, అంబేడ్కర్ భవన్‌లకు స్థలాన్నిచారు. ఎస్సారెస్పీ నుంచి గతంలో గృహ నిర్మాణశాఖ హౌజింగ్‌బోర్డుకు ఇచ్చిన స్థలంలో ఇళ్లను నిర్మించి విక్రయించారు. ప్రస్తుతం గోదాములను తొలగించిన స్థలం, ఆగ్రోస్ నుంచి తీసుకున్న స్థలంలో వైద్య కళాశాలను నిర్మిస్తున్నారు.

**మరిన్ని ప్రభుత్వ విభాగాల ఏర్పాటు**

2016 అక్టోబరులో జగిత్యాల జిల్లా కేంద్రంగా ఏర్పడగా.. ధరూర్‌క్యాంపులోని ఎస్సారెస్పీ స్థలంలోనే నూతన కలెక్టరేట్, పోలీస్‌శాఖ జిల్లా కార్యాలయం, ఎస్పీ భవన్, సిబ్బంది భవనాలు నిర్మించారు. మాతాశిశు ఆరోగ్య కేంద్రం, డయాగ్నోస్టిక్ కేంద్రం, విద్యుత్తు ప్రగతి భవన్, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం, ఉన్నతాధికారుల నివాస గృహాలు, జడ్పీ భవనం, పంచాయతీరాజ్, విద్యాభవన్, ఈవీఎంలను భద్రపరిచే గోదాము, భరోసా కేంద్రం, జిల్లా మహిళా సమాఖ్య భవనం, అమరవీరుల స్థూపం, రెండు పార్కులు, వ్యవసాయశాఖ ఏడీఏ, ఏవోల కార్యాలయాలు ఏర్పాటు చేశారు. జిల్లా కోర్టు భవనానికి స్థలాన్ని కేటాయించారు. క్యాంపును ఆనుకుని వెళ్తున్న ఎస్సారెస్పీ కాలువను పైపులతో మూసివేసి రహదారి విస్తరించనుండగా.. మరికొన్ని ప్రభుత్వ విభాగాలను ఇక్కడే ఏర్పాటు చేయనుండటం ప్రజలకు అత్యంత సౌకర్యంగా మారనుంది.

# మన్యం.. ప్రగతి పథం..!

భద్రాచలం : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను భద్రాచలం మన్యంలో సంపూర్ణంగా అమలుచేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఆది కర్మ యోగి పథకం ఫలాలను క్షేత్రస్థాయికి చేర్చేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఇందుకు ఐటీడీఏ పరిధిలోని 19 మండలాల్లో ఎంపిక చేసిన 130 గ్రామాల్లో పరిస్థితులను తెలుసుకుంటున్నారు. ఆదివాసీ పల్లెల్లో అన్ని రకాల సమస్యలు పరిష్కరించేందుకు రచ్చబండ తరహాలో గ్రామసభలు నిర్వహిస్తున్నారు. దుమ్ముగూడెం మండలం నడికుడి, సింగవరంలో గ్రామసభలను ప్రారంభించారు. గిరిజనులకు ఏం కావాలో వివరాలు సేకరిస్తున్నారు. వ్యక్తిగత సామాజిక అవసరాలతో పాటు మౌలిక సదుపాయాల కల్పనకు ఇందులో ప్రాధాన్యం కల్పిస్తున్నారు.




**గ్రామాల వారీగా కార్యాచరణ ప్రణాళిక**

2030 నాటికి ఆదివాసీ గ్రామసీమలు అభివృద్ధికి మారుపేరుగా నిలవాలన్నది ఈ పథకం ఉద్దేశం. ఆది కర్మ యోగి పథకం అమలు చేస్తున్న మండలాల వివరాలను పీఓ రాహుల్ బుధవారం వెల్లడించారు. ఆయా ప్రాంతాల్లో అధికారులు, సిబ్బంది ఈనెలాఖరు వరకు పర్యటించాలని చెప్పారు. అధికారులు గ్రామాలకు వెళ్లినప్పుడు రహదారులు, మురుగు కాల్వలు, విద్యుత్తు, విద్యాలయాలు, విద్యార్థులకు వసతి, వ్యవసాయ భూముల్లో సాగుయోగ్యానికి అవసరమైన సదుపాయాలు, వైద్యశాలల్లో వసతులు, పంచాయతీ కార్యాలయాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, సంక్షేమ పథకాలు, క్రీడా ప్రాంగణాలు, పార్కులు, గ్రంథాలయాలు ఇలా ఏది కావాలో తెలుసుకుని గ్రామాల వారీగా ప్రణాళిక రూపొందించే పనిలో నిమగ్నమయ్యారు. భారీస్థాయిలోనే నిధులు కావాలని ప్రతిపాదించేందుకు పీఓ రాహుల్ నేతృత్వంలో చర్యలు చేపట్టామని ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్ తెలిపారు.

# వినియోగదారుల చూపే బంగారమాయనే..!

కొత్తగూడెం : 'బంగారంపై జీఎస్టీని మూడు శాతం నుంచి ఒక్క శాతానికి తగ్గించాలి. గతంలో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీని నెరవేర్చాలి. బంగారు, వెండి వర్తకులను ఆదుకోవాలి' అని కొత్తగూడెం పట్టణం వెండి, బంగారు వర్తకుల సంఘం ఉపాధ్యక్షుడు కొమ్ము వెంకటేశ్వర్లుకు తెలిపారు. బంగారం అనగానే 'కొరకరాని కొయ్య' అనే నానుడి ఎదురవుతోందంటే అతిశయోక్తి కాదు. సామాన్యులు కొనాలంటే అసాధ్యమనే స్థాయికి ధరలు పెరిగిపోయాయి. ఆఖరికి మధ్యతరగతి అంతకంటే ఓ మోస్తరు తరగతి ప్రజలు సైతం ఆభరణాలు కొనాలంటే ఇప్పుడున్న పరిస్థితుల్లో హడలెత్తిపోతున్నారు. ఐదారేళ్ల క్రితం వరకు దసరా పండుగ వచ్చిందంటే జ్యువెలరీ దుకాణాలు వినియోగదారులతో కిటకిటలాడేవి. ఇప్పుడు బోసిపోతున్నాయి. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో జ్యువెలరీ దుకాణాలు సుమారు 1,230 ఉన్నాయి.

**క్రమంగా పెరిగి.. అందనంత ఎదిగి..!**

ఆరేళ్ల క్రితం పది గ్రాముల బంగారు ధర రూ.35వేల వరకు పలికింది. సుమారు రెండేళ్ల క్రితం రూ.65వేల వరకు చేరింది. రష్యా, ఉక్రెయిన్ యుద్ధం, అంతర్జాతీయ అనిశ్చితుల కారణంగా బంగారం ధరలకు రెక్కలొచ్చాయి. రెండేళ్లలోనే 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర రూ.1.18లక్షలు చేరింది. ధర అమాంతంగా పెరిగిపోవటంతో 80శాతం కొనుగోళ్లు తగ్గుముఖం పట్టాయి. కేవలం పెళ్లిళ్ల సీజన్‌లో తప్పితే ఇతర పండుగలు, శుభకార్యాలకు బంగారం కొనటం లేదని వ్యాపారులు వాపోతున్నారు.

**ఉభయ జిల్లాల్లో గణనీయంగా తగ్గిన టర్నోవర్**

ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో ఆరేళ్ల క్రితం వరకు నెలవారీ టర్నోవర్ రూ.50 కోట్ల నుంచి రూ.65 కోట్ల వరకు ఉండేదని వ్యాపారులు చెబుతున్నారు. ఇప్పుడు ప్రతినెలా రూ.10కోట్ల నుంచి రూ.15కోట్లకు పరిమితమైందని ఆవేదన చెందుతున్నారు. వెండి ధరలు సైతం పైపైకి చేరుతుండటంతో వ్యాపారం గిట్టుబాటు కావటం లేదంటున్నారు. అద్దెలు చెల్లించలేని పరిస్థితుల్లో కొందరు దుకాణాలకు మూసేసుకుంటున్నారు. అద్దె భవనాల్లోని దుకాణాల ఎత్తివేతకు మరికొందరు సిద్ధపడుతున్నారు.

# నిండుగా గోదారి.. చేప పిల్లల విడుదలేదీ?

ధర్మపురి : ఈ ఏడాది పుష్కలమైన నీటి లభ్యత ఉండి కూడా మత్స్యకారులు సరైన ఉపాధి పొందలేకపోతున్నారు. ఎల్లంపల్లి జలాల ఆధారంగా చేప పిల్లల అభివృద్ధి, వీటి ద్వారా ఉపాధి అవకాశాలు పొందడానికి అవకాశాలు మెరుగ్గా ఉన్నా ప్రభుత్వం నుంచి సరైన ప్రోత్సాహం లభించకపోవడంతో మత్స్యకారుల పరిస్థితి అస్తవ్యస్తంగా మారింది. దీంతోపాటు జిల్లాలోని వివిధ చెరువుల్లో ఇప్పటి వరకు ఉచితంగా చేప పిల్లల పంపిణీకి ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో పరిస్థితి అస్తవ్యస్తంగా మారింది.

జిల్లాలో 765 చెరువులు, 272 మత్స్య కార్మిక సంఘాలున్నాయి. ఈ సంఘాలకు ఉచితంగా 1.44 కోట్ల చేప పిల్లల్ని పంపిణీ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నా అడుగు ముందుకు పడటం లేదు. ఆయా ప్రతిపాదనలను ఉన్నతాధికారులకు పంపించినా అనుమతులు రాలేదు. జులైలో వదిలితే ఇప్పటికే బాగా ఎదిగి విక్రయాలకు అనుకూలంగా ఉండేవి.

**500 కుటుంబాల్లో..**

రెండేళ్ల కిందటి వరకు ఎల్లంపల్లి రిజర్వాయర్‌లో 12.21 లక్షల చేప పిల్లల్నిపోయగా ధర్మపురి, వెల్గటూరు ప్రాంతాల్లోని నదీ తీర మత్స్యకారులకు చేప పిల్లల పంట పండేది. దీంతో కార్మికులకు రెండు నెలలపాటు చేతినిండా పని ఉండేది. ప్రతీ కార్మికుడు నిత్యం రూ.వెయ్యి నగదు సంపాదించేవారు. రాయితీపై కేటాయించిన ద్విచక్రవాహనాల ద్వారా నదిలో సేకరించిన చేపలను దూరప్రాంత మార్కెట్లకు, పల్లెలకు తీసుకెళ్లి విక్రయించేవారు. ఈ ఏడాది వానాకాలంలో రికార్డు స్థాయిలో ఎల్లంపల్లి జలాశయంలో నీటి మట్టం ఉన్నా ధర్మపురి నియోజకవర్గంలోని ధర్మపురి, వెల్గటూరు మండలాల్లోని 500 మత్స్యకారుల కుటుంబాలకు నిరాశే మిగిలింది.




భారత్-ఆస్ట్రేలియా వాణిజ్యంలో ఏపీది కీలక పాత్ర అని మంత్రి నారా లోకేశ్ అన్నారు. భారత్‌లో పెట్టుబడులకు ఏపీ గమ్యస్థానంగా ఉందన్నారు. ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్న లోకేశ్.. బ్రిస్బేన్ బిజినెస్ రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. భారత్-ఆస్ట్రేలియా మధ్య స్నేహపూర్వక ద్వైపాక్షిక వాణిజ్యం కొనసాగుతోందన్నారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్, ఈజ్ ఆఫ్ డూయింగ్ విధానాలు అమలవుతున్నాయని చెప్పారు. గత 16 నెలల్లో ఏపీకి రూ.10 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు వచ్చాయని చెప్పారు. విశాఖలో రూ.1.33 లక్షల కోట్లతో గూగుల్ ఏఐ హబ్ ఏర్పాటుకు ఒప్పందం జరిగిందని వివరించారు. ఏపీలో పారిశ్రామికవేత్తల కోసం సులభతర పాలసీలు అమలుచేస్తున్నట్లు చెప్పారు ఆర్సెలార్ మిత్తల్ సంస్థ రూ.1.35 లక్షల కోట్లతో అనకాపల్లి సమీపంలో దేశంలోనే అతిపెద్ద స్టీల్ ప్లాంట్ నిర్మించబోతోందని వివరించారు. ప్రస్తుతం భారత్‌లో పెట్టుబడులకు ఆంధ్రప్రదేశ్ గేట్ వేగా మారిందన్నారు. నవంబర్‌లో 14, 15 తేదీల్లో విశాఖపట్నంలో నిర్వహించే పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్-2025కి హాజరుకావాలని ఆస్ట్రేలియా పారిశ్రామికవేత్తలకు లోకేష్ విజ్ఞప్తి చేశారు.

## భీమవరం డీఎస్పీకి మంచి ట్రాక్ రికార్డు ఉంది: డిప్యూటీ స్పీకర్ రఘురామ



విశాఖపట్నం: భీమవరం డీఎస్పీ జయసూర్య వ్యవహారంపై డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు స్పందించారు. తనకున్న సమాచారం ప్రకారం ఆయనకు మంచి ట్రాక్ రికార్డు ఉందని చెప్పారు. పశ్చిమగోదావరి జిల్లాలో జూదంపై పోలీసులు గట్టి నిఘా పెట్టారన్నారు. అందుకే డీఎస్పీపై అభియోగాలు వస్తున్నట్లు భావిస్తున్నానని చెప్పారు. ఉండి నియోజకవర్గంలో ఎలాంటి జూద శిబిరాలు లేవని చెప్పారు. ఈ అంశంలో కూటమి ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోందన్నారు.

**భీమవరం డీఎస్పీపై ఫిర్యాదుల వెల్లువ...** భీమవరం డీఎస్పీ జయసూర్య తీరుపై ఇటీవల ఫిర్యాదులు వెల్లువెత్తాయి.

ఆయన పరిధిలో జూద శిబిరాలు పెరిగిపోయాయని.. సివిల్ వివాదాల్లో జోక్యం చేసుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ స్పందిస్తూ డీఎస్పీ వ్యవహారశైలిపై నివేదిక కోరారు. జిల్లా ఎస్పీతో ఆయన మాట్లాడారు.

## అప్పుడేం చేశారు గాడిదలు కాశారా?.. వైసీపీపై మంత్రి ఫైర్



విజయవాడ, అక్టోబర్ 22: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై మంత్రి సత్యకుమార్ యాదవ్ ఫైర్ అయ్యారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. మెడికల్ కళాశాలల నిర్మాణం పీపీపీ మోడల్‌లోనే జరుగుతుందని స్పష్టం చేశారు. గత ఐదేళ్లలో జగన్ ప్రభుత్వం మెడికల్ కాలేజ్‌ల నిర్మాణం చేపట్టలేదని విమర్శించారు. ఐదు వేలకోట్లు పనులకు ఐదు వందలకోట్ల పనులు చేశారన్నారు. పులివెందులలో మాత్రమే జగన్.. మెడికల్ కళాశాలను పూర్తి చేశారని చెప్పుకొచ్చారు. కూటమి ప్రభుత్వంలో పది మెడికల్ కళాశాలలు పీపీపీ విధానంలో పూర్తి చేస్తామని ప్రకటించారు. జగన్ బెదిరింపులకు ఎవరూ తగ్గేది లేదన్నారు. ఆయన వచ్చి కట్టే వరకు విద్యార్థులు నష్టపోయారని.. అయినా జగన్ మళ్లీ అధికారంలోకి రావడం కల్ల అని అన్నారు. వైసీపీ వచ్చేది లేదు.. చచ్చేది లేదంటూ వ్యాఖ్యలు చేశారు. పది మెడికల్ కళాశాలు పూర్తి అయితే డెబ్బై శాతం పేద విద్యార్థులకు మేలు జరుగుతుందన్నారు.

యాజమాన్య హక్కులు, నిర్వహణ మొత్తం ప్రభుత్వం చేతిలోనే ఉంటాయని వెల్లడించారు. గత ప్రభుత్వం నిర్వాకం వల్లే నేడు పీపీపీ విధానంలో తాము నిర్మిస్తున్నామని చెప్పారు. వైసీపీ ప్రభుత్వంలో నిర్మాణం చేయకుండా గాడిదలను కాశారా అంటూ ఫైర్ అయ్యారు. ఇంకా అబద్ధాలు, అసత్యాలతో ప్రజలను మోసం చేస్తున్నారన్నారని మంత్రి మండిపడ్డారు. ఉద్దానం విషయంలో కూడా రాద్ధాంతం చేస్తున్నారని.. ఇలా చేస్తే 11 సీట్లు కూడా ఈసారి రావన్నారు. ప్రజలు చిత్తుగా ఓడించారని జగన్ కక్ష కట్టారని ఆరోపించారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం జరగకుండా అడ్డు పడుతున్నారన్నారు. అన్ని విషయాలు ప్రజలు గమనిస్తున్నారని.. వాళ్లకి తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఎన్టీఆర్ వైద్య సేవలపై చర్చిస్తున్నామని.. అన్నీ సర్దుకుంటాయని మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు.

## 12 గంటల్లోపు వాయుగుండం.. హోంమంత్రి కీలక ఆదేశాలు




అమరావతి, అక్టోబర్ 22: బంగాళాఖాతంలోని తీవ్ర అల్పపీడనం రాబోయే 12 గంటల్లోపు వాయుగుండంగా బలపడనున్న నేపథ్యంలో ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తమైంది. ఉత్తర తమిళనాడు, పుదుచ్చేరి, దక్షిణకోస్తా తీరాల వైపు కదులుతూ ఆ తదుపరి 12 గంటల్లో మరింత బలపడే అవకాశం ఉంది. దీని ప్రభావంతో దక్షిణ కోస్తా, రాయలసీమలో అతిభారీ వర్షాల నేపథ్యంలో విపత్తుల నిర్వహణ సంస్థ అధికారులతో హోం మంత్రి అనిత ఈరోజు (బుధవారం) సమీక్ష సమావేశం నిర్వహించారు. బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని.. అత్యవసరమైతే తప్ప ప్రయాణాలు చేయరాదని సూచించారు. సహాయక చర్యలకు ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, పోలీస్, ఫైర్ సిబ్బంది సిద్ధంగా ఉండాలని హోంమంత్రి ఆదేశించారు. జిల్లాల్లో కంట్రోల్ రూమ్స్ 24/7 అలెర్ట్‌గా ఉండాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రాణనష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని.. ప్రజలకు ఎటువంటి అసౌకర్యం లేకుండా చూడాలని స్పష్టం చేశారు. వాతావరణ పరిస్థితులపై ప్రజలకు ఎప్పటికప్పుడు హెచ్చరిక మెసేజ్లు పంపాలని అధికారులకు తెలియజేశారు. సహాయం కోసం 24 గంటలు అందుబాటులో ఉండే టోల్ ఫ్రీ నెంబర్లు 112, 1070, 18004250101 సంప్రదించాలన్నారు. ప్రజలు సురక్షితమైన భవనాల్లో ఉండాలని హోంమంత్రి అనిత వినతి చేశారు.

**అధికారులు సిద్ధంగా ఉండండి: మంత్రి అనగాని...** మరోవైపు.. రాష్ట్రానికి వాయుగుండం ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో అధికారులను రెవెన్యూ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ అప్రమత్తం చేశారు. దక్షిణ కోస్తా జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురవనున్న నేపథ్యంలో రెవెన్యూ అధికారులు సంసిద్ధంగా ఉండాలన్నారు. అవసరమైతే లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు. మత్స్యకారులు ఎవ్వరూ చేపల వేటకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. భారీ వర్షాల కారణంగా ఎక్కడెక్కడ వాగులు పొంగుతాయో అక్కడి ప్రజలను హెచ్చరించాలని ఆదేశాలు జారీ చేశారు. చెట్లు విరిగిపడే చోట ప్రజా రవాణాకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. నెల్లూరు జిల్లాలో ఇప్పటికే భారీ వర్షాలు కురుస్తున్న కారణంగా అధికారులంతా సహాయక చర్యల్లో పాల్గొనాలని మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆదేశాలు జారీ చేశారు.

## వారి సారథ్యంలో ఏపీకి పెద్ద ఎత్తున పెట్టుబడులు: మాధవ్




విజయవాడ, అక్టోబర్ 22: ఏపీకి కేంద్రం నుంచి లక్షన్నర కోట్ల సాయం అందిందని బీజేపీ ఏపీ అధ్యక్షులు మాధవ్ తెలిపారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. లక్షా 80వేల కోట్ల పెట్టుబడితో గ్రీన్ హైడ్రోజన్ హబ్ పనులు శరవేగంగా సాగుతున్నాయన్నారు. రూ.11,444 కోట్లతో విశాఖ స్టీల్ ప్లాంట్ అభివృద్ధికి నిధులు కేటాయించారని చెప్పారు. గూగుల్ డేటా సెంటర్ ద్వారా 15 బిలియన్ డాలర్ల ఒక లక్షా 25వేల కోట్లతో విశాఖకు రావడం డబుల్ ఇంజన్ గ్రోత్‌కు ఒక చిహ్నమని పేర్కొన్నారు. విశాఖను గ్లోబల్ గ్రోత్ సెంటర్‌గా మార్చేలా అనేక కంపెనీలు, ఐటీ సంస్థలు వస్తున్నాయని వెల్లడించారు మాధవ్. ప్రధాని మోడీ నేతృత్వంలో ఈ ప్రాజెక్టులన్నీ ముందుకు తీసుకురావడం, సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ ఆధ్వర్యంలో విశాఖలో గూగుల్ డేటా సెంటర్ రావడం వల్ల ఏపీకి ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు వచ్చిందని తెలిపారు. కర్ణాటక వంటి పక్క రాష్ట్రాలకు కంటగింపుగా మారిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాలు దగాకోరు రాజకీయాలు చేస్తూ.. వారి వైఫల్యాలను వారే బయట పెట్టుకుంటున్నారని విమర్శించారు. కర్ణాటకలో ఫెయిల్ గవర్నమెంట్ ఉంది కాబట్టే.. ఆ పార్టీ తరపున వారు ఆక్రోశం వెలిబుచ్చుతున్నారని వ్యాఖ్యలు చేశారు. మోడీ, చంద్రబాబులు అసాధ్యమైన అంశాన్ని సాధించి.. ప్రపంచ వ్యాప్తంగా ఏపీ గురించి చర్చించుకునేలా చేశారని ఏపీ బీజేపీ చీఫ్ తెలిపారు. కృత్రిమ మేధస్సుతో అనేక ప్రయోగాలకు విశాఖ వేదిక కాబోతుందన్నారు. ఎనర్జీ సోర్స్ కింద సోలార్, విండ్, హై ఎనర్జీలను వాడేందుకు గ్రీన్ ఎనర్జీ తయారవుతుందన్నారు. టెక్నాలజీ, ఇంజనీరింగ్, మ్యాన్ ఫ్యాక్చరింగ్‌లో యువత ప్రతిభకు చైనా తర్వాత ఏపీకే అవకాశాలు ఉన్నాయని చెప్పుకొచ్చారు. అమెరికాలో ఆంక్షలు ఉండటంతో భారత దేశంలోనే వీరంతా ఉండబోతున్నారని అన్నారు. ఐదేళ్లలో ఐదు లక్షల ఉద్యోగాలు యువతకు వస్తాయని ప్రకటించారు. నరేంద్ర మోడీ, రాష్ట్ర ప్రభుత్వం సారథ్యంలో ఏపీకి పెద్ద ఎత్తున పెట్టుబడులు వస్తున్నాయని తెలిపారు. వైజాగ్ - చెన్నై కారిడార్, బెంగుళూరు - చెన్నై కారిడార్, రాయలసీమ వైపు మరో కారిడార్‌లు రాబోతున్నాయని మాధవ్ అన్నారు. డిపెన్స్ క్లస్టర్స్, అతిపెద్ద రిఫైనరీ, జాతీయ రహదారుల కనెక్టివిటీ అన్ని ప్రాంతాలకు పెరగడం ద్వారా అభివృద్ధి మరింత పెరుగుతుందని అభిప్రాయపడ్డారు.




## అల్పపీడనం ప్రభావం.. ఏపీలో 6 జిల్లాలకు రెడ్ అలర్ట్

అమరావతి: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో ఏపీలోని పలు ప్రాంతాల్లో వర్షాలు కురుస్తున్నాయి. నేడు ఏపీలోని ప్రకాశం, వైఎస్ఆర్ కడప, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు, అన్నమయ్య, తిరుపతి, చిత్తూరు జిల్లాలకు వాతావరణ శాఖ అధికారులు రెడ్ అలర్ట్ జారీ చేశారు. కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేశారు. పల్నాడు జిల్లాకు ఎల్లో అలర్ట్ జారీ చేశారు. నెల్లూరు, ప్రకాశం జిల్లాలతో పాటు రాయలసీమలోని పలు చోట్ల వర్షం పడుతోంది. నెల్లూరు జిల్లాలో నాలుగు రోజులుగా వర్షం కురుస్తోంది.

ఏఎస్ పేట వద్ద గాలులకు చెట్లు విరిగిపడ్డాయి. పలు చెరువుల్లోకి వరద నీరు భారీగా చేరుతోంది. చేజెర్ల, అనంతసాగరం ప్రాంతాల్లో వరి పంట నీటమునిగింది. భారీ వర్షాల నేపథ్యంలో రెవెన్యూ, పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. విద్యా సంస్థలకు కలెక్టర్ హిమాన్షు శుక్లా సెలవు ప్రకటించారు. పోలీసు, రెవెన్యూ యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. వర్షాల దృష్ట్యా కలెక్టరేట్‌లో 0861 2331261, 79955 76699 నంబర్లతో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కడప జిల్లాల్లో మంగళవారం రాత్రి నుంచి ఎడతెరిపి లేని వర్షం కురుస్తోంది. రహదారులపై వర్షపు నీరు ప్రవహిస్తోంది. కాలువల్లో వ్యర్థాలు, చెత్తా చెదారాన్ని నగరపాలక సిబ్బంది తొలగిస్తున్నారు. అగ్నిమాపక, పోలీసు, రెవెన్యూ అధికారులు అప్రమత్తమయ్యారు.

**పొంచి ఉన్న వాయుగుండం ముప్పు...** రాష్ట్రానికి వాయుగుండం ముప్పు పొంచి ఉంది. నైరుతి బంగాళాఖాతం-ఉత్తర శ్రీలంక మధ్య అల్పపీడనం కొనసాగుతోంది. ఇది పశ్చిమ వాయవ్యంగా కదిలి నైరుతి, పశ్చిమ బంగాళాఖాతం మధ్య మధ్యాహ్నం వాయుగుండంగా మారే అవకాశముంది. వాయవ్యంగా కదిలి 24 గంటల్లో వాయుగుండం మరింత బలపడే అవకాశముంది. ఉత్తర తమిళనాడు, దక్షిణ కోస్తా వైపు వాయుగుండం కదిలే అవకాశముంది. తమిళనాడు, కేరళలో వాతావరణ శాఖ అధికారులు రెడ్ అలర్ట్ జారీ చేశారు. మధ్యాహ్నం నుంచి తీరం వెంట 30-45 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందిని తెలిపారు.




## ఆస్ట్రేలియా పర్యటనలో మంత్రి నారా లోకేశ్

మంత్రి నారా లోకేశ్ ఆస్ట్రేలియా పర్యటన కొనసాగుతోంది. ఇందులో భాగంగా గ్రిఫిత్ యూనివర్సిటీ వైస్ ప్రెసిడెంట్ (గ్లోబల్) మార్నీ వాట్సన్‌తో గోల్డ్ కోస్ట్ క్యాంపస్‌లో ఆయన భేటీ అయ్యారు. యూనివర్సిటీ స్పోర్ట్స్ కళాశాలలో అధునాతన క్రీడా సౌకర్యాలను పరిశీలించారు. పబ్లిక్ పాలసీ, సస్టైనబిలిటీ, ఇన్నోవేషన్ రంగాల్లో సంయుక్త కార్యక్రమాల కోసం చొరవ చూపాలన్నారు. ఆంధ్రప్రదేశ్-గ్రిఫిత్ విశ్వవిద్యాలయం భాగస్వామ్యం ఏర్పాటు చేయాలని కోరారు. పరిశోధన, విద్యార్థుల మార్పిడి, అవగాహన సమన్వయానికి ఏపీలో హబ్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. సిలబస్ రూపకల్పన, నైపుణ్య ధ్రువీకరణకు ఏపీ వర్సిటీలతో భాగస్వామ్యం వహించాలని కోరారు. "పునరుత్పాదక శక్తి, ప్రజారోగ్యం, నీటి నిర్వహణ రంగాల్లో సంయుక్త పరిశోధన ప్రాజెక్టులు ప్రారంభించాలి. గ్రిఫిత్ యూనివర్సిటీ, ఆంధ్రప్రదేశ్‌లోని ప్రముఖ విద్యాసంస్థల మధ్య డ్యూయల్ డిగ్రీ లేదా ట్విన్నింగ్ ప్రోగ్రామ్‌లను అభివృద్ధి చేయాలి. స్కాలర్‌షిప్‌లు, అధ్యాపకులు, విద్యార్థుల అభివృద్ధికి ఎక్స్చేంజి కార్యక్రమాలను ప్రోత్సహించాలి. నవంబర్ 14, 15 తేదీల్లో నిర్వహించే విశాఖ భాగస్వామ్య సదస్సుకు హాజరు కావాలి. స్టార్టప్‌లకు మద్దతునిచ్చేలా ఆంధ్రప్రదేశ్ రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌తో కలిసి పనిచేయాలి" అని లోకేశ్ విజ్ఞప్తి చేశారు.




బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో తిరుపతి జిల్లాలో జోరు వాన కురుస్తోంది. మంగళవారం అర్ధరాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా వాన పడుతోంది. దీంతో పలుచోట్ల రహదారులు జలమయం అయ్యాయి. నగరంలోని లక్ష్మీపురం సర్కిల్, మధురానగర్, సత్యనారాయణపురం, వైకుంఠపురం, వెస్ట్ చర్చి, కొర్లగుంట, లీలామహల్ కూడలిలో రోడ్లపైకి వరద చేరింది. పలు చోట్ల రహదారులపై మోకాళ్ల లోతు వరకు వరద ప్రవహిస్తుండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

## దస్తగిరి బ్యారక్‌కు చైతన్యరెడ్డి.. ఆరోజే జైలు అధికారిని ప్రశ్నించా: బీటెక్ రవి



కడప: మాజీ మంత్రి వివేకా హత్య కేసులో అప్రూవర్‌గా మారిన దస్తగిరి బ్యారక్‌లోకి నిందితుడు శివశంకర్‌రెడ్డి కుమారుడు చైతన్యరెడ్డి వెళ్లడం తాను చూశానని పులివెందుల తెదేపా ఇన్‌ఛార్జ్ బీటెక్ రవి తెలిపారు. దస్తగిరిని చైతన్యరెడ్డి బెదిరించిన కేసుపై కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ కడప జైలులో బుధవారం విచారణ చేపట్టారు. దస్తగిరిని బెదిరించిన సమయంలో వేరే కేసులో అదే జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నందున బీటెక్ రవిని కూడా అధికారులు విచారించారు. విచారణకు హాజరైన అనంతరం మీడియాతో ఆయన మాట్లాడారు. "దస్తగిరిని బెదిరించిన కేసులో విచారణకు పిలిస్తే వచ్చాను. కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్‌కు నా వాంగ్మూలం ఇచ్చాను. 2023 నవంబర్ 28న దస్తగిరి బ్యారక్‌లోకి డాక్టర్ చైతన్యరెడ్డి వెళ్లడం కళ్లారా చూశాను. ఆ బ్యారక్ ఎదురుగానే రిమాండ్ ఖైదీగా ఉన్నాను. వివేకా హత్య కేసులో అప్రూవర్‌గా ఉన్న దస్తగిరి బ్యారక్‌లోకి నిందితుడి కుమారుడిని ఎలా పంపిస్తారు? ఈ విషయంపై ఆరోజే జైలు అధికారి ప్రకాశ్‌ను ప్రశ్నించా. కానీ.. నేను చెప్పిన విషయాన్ని అధికారులు పట్టించుకోలేదు. ఆరోజు ఏం జరిగిందనేది ఎస్పీ విక్రాంత్‌పాటిల్‌కు కూలంకషంగా వివరించాను. దస్తగిరిని జైలుకెళ్లి బెదిరించడంలో కుట్ర దాగి ఉంటుందని భావిస్తున్నాను" అని బీటెక్ రవి అన్నారు.

## బంధువునంటూ చెప్పి మైనర్ బాలికపై దారుణం..





కాకినాడ, అక్టోబర్ 22: తుని బాలికల గురుకుల పాఠశాలలో దారుణం జరిగింది. ఎనిమిదో తరగతి చదువుతున్న మైనర్ బాలికపై అత్యాచార యత్నానికి పాల్పడ్డాడు ఓ కామాంధుడు. ఈ ఘటన తీవ్ర కలకలం రేపుతోంది. బాలికకు మాయ మాటలు చెప్పి స్కూల్ నుంచి నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లిన నిందితుడు.. ఈ అఘాయిత్యానికి ఒడిగట్టాడు. విషయం తెలిసిన బాలిక బంధువులు తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. నారాయణరావు అనే వ్యక్తి.. తరచూ గురుకుల పాఠశాలకు వెళ్లి బాలిక బంధువును అని చెప్పి ఆమెను తీసుకెళ్లేవాడని తెలుస్తోంది. నిన్న (మంగళవారం) కూడా గురుకుల పాఠశాలకు వచ్చిన నారాయణ... బాలికను ఎవరూ లేని ప్రాంతానికి తీసుకెళ్లాడు. ఆపై బాలికపై అత్యాచారం చేసేందుకు యత్నించాడు. స్థానికులు గమనించి నిలదీయగా అక్కడి నుంచి పరారయ్యాడు నిందితుడు. విషయం తెలిసిన బాలిక తల్లిదండ్రులు గురుకుల పాఠశాల ముందు ఆందోళనకు దిగారు.

నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## గ్లామర్ లుక్ తో కట్టిపడేస్తున్న కయాదు లోహర్!

ప్రస్తుతం ఎక్కడ చూసినా దేశవ్యాప్తంగా సెలబ్రిటీలు దీపావళి వేడుకలను ఘనంగా జరుపుకుంటున్నారు.. అందులో భాగంగానే తమ తోటి నటీనటులకు ప్రత్యేకంగా ఆహ్వానం పలుకుతూ తమ ఇంట సెలబ్రేషన్స్ జరుపుకుంటున్న విషయం తెలిసిందే..ఇంకొంతమంది ఈ దీపావళి వేళ చాలా అందంగా ముస్తాబయి.. ఆ ఫోటోలను సోషల్ మీడియాలో షేర్ చేస్తున్నారు. ఈ క్రమంలోనే మరొక యంగ్ బ్యూటీ కూడా ఈ దీపావళి పండుగను పురస్కరించుకొని గ్లామర్ లుక్ తో కట్టిపడేస్తూ సోషల్ మీడియాలో కూడా కొన్ని ఫోటోలు షేర్ చేసింది. అందులో రెడ్ కలర్ లెహంగ ధరించిన ఈమె పండుగ వేళ అందాలను హైలెట్ చేస్తూ అభిమానులను కట్టిపడేసింది.ఆమె ఎవరో కాదు యంగ్ బ్యూటీ కయాదు లోహర్.



డ్రాగన్ సినిమాతో ఓవర్ నైట్ లోనే భారీ పాపులారిటీ సొంతం చేసుకున్న ఈమె అతి తక్కువ సమయంలోనే ఊహించని పాపులారిటీ ప్రస్తుతం సోషల్ మీడియాలో యాక్టివ్గా ఉంటున్న ఈమె.. అభిమానులను ఆకట్టుకునేలా దీపాలు వెలుగుల్లో తన మేనిఛాయను మరింత రెట్టింపు చేసుకుంది . ప్రస్తుతం ఈ ముద్దుగుమ్మ షేర్ చేసిన ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవ్వడంతో అభిమానులు దీపావళి శుభాకాంక్షలు చెబుతూ ఈమె అందానికి ఫిదా అవుతూ.. లవ్ , ఫైర్ ఎమోజీలను షేర్ చేస్తున్నారు. కయాదు లోహర్.. అస్సాంలోని తేజ్ పూర్ లో 2000 ఏప్రిల్ 11న జన్మించింది పూనేలో నివసిస్తున్న ఈమె కామర్స్ లో గ్రాడ్యుయేట్ పూర్తి చేసింది. ఇండస్ట్రీలోకి రాకముందు మోడల్గా తన కెరీర్ ను మొదలుపెట్టిన కయాదు లోహర్ 2021 లో వచ్చిన కన్నడ చిత్రం మొగిలిపేట చిత్రంతో ఇండస్ట్రీలోకి అరంగేట్రం చేసింది. ఇకపోతే మలయాళంలో ఈమె నటించిన పాథోన్ పథం నూట్టండు చిత్రం తెలుగులో పులి: ది 19త్ సెంచరీ పేరుతో 2023 ఫిబ్రవరి 24న ఈ చిత్రాన్ని విడుదల చేశారు. 2023 లో వచ్చిన అల్లూరి సినిమాతో తెలుగు ప్రేక్షకులను పలకరించిన ఈమె.. ఆ తర్వాత వచ్చిన డ్రాగన్ సినిమాతో ఊహించని పాపులారిటీ సొంతం చేసుకుంది. ముఖ్యంగా ఈ సినిమాతో ఓవర్ నైట్ లోనే స్టార్ హీరోయిన్గా పేరు సొంతం చేసుకుంది కయాదు లోహర్.

## కోడళ్లపై పెత్తనం చెలాయించను.. అక్కినేని అమల

అక్కినేని వారి ఇంట ఇటీవల కాలంలో రెండు పెళ్లిళ్లు జరిగాయి. నాగార్జున ఇద్దరు కుమారులు నాగచైతన్య, అఖిల్ వివాహ బంధంలోకి అడుగుపెట్టారు. 2024లో హీరోయిన్ శోభిత దూళిపాళను చైతన్య వివాహం చేసుకోగా... ఈ ఏడాదే ముంబైకి చెందిన వ్యాపారవేత్త జైనబ్ రివ్జీను అఖిల్ పెళ్లాడారు. దీంతో కొత్త కోడళ్ల రాకతో అక్కినేని వారి ఇళ్లు కలకలాడుతుంది. అయితే మామూలుగా అందరి ఇళ్లలో అత్తా- కోడళ్లు ఎలా ఉంటారో అందరీ తెలుసు. కానీ, సెలబ్రిటీలు ఎలా ఉంటారు? ఆ రిలేషన్ ఎలా మెయింటేన్ చేస్తారో తెలుసుకోవాలని చాలా మందికి ఉంటుంది. సెలబ్రిటీల ఇంట్లో అత్తా- కోడళ్ల మధ్య బాండింగ్, వాళ్లు అనుసరించే విధానాలు తెలుసుకోవాలని అనుకుంటారు. ఈ క్రమంలోనే కోడళ్లతో తన అనుబంధం గురించి నాగ్ సతీమణి అమల రీసెంట్ గా ఓ ఇంటర్వ్యూలో పంచుకున్నారు. తన కోడళ్ల గురించి గొప్పగా చెప్పారు. ఆమె కోడళ్లు బంగారం అని అన్నారు. తమ ఇంటికి శోభిత, జైనబ్ రావడంతో తనకు గర్ల్ సర్కిల్ ఏర్పడిందని అమల అన్నారు. వాళ్లు ఎప్పుడూ ఆనందంగా కనిపిస్తారని,



వాళ్ల వల్లే జీవితం సరికొత్తగా మారిందని చెప్పారు. కోడళ్లతో ఉన్నప్పుడు భలే సరదాగా ఉంటుందని, ఇక వాళ్ల వ్యక్తిగత విషయాల్లో తలదూర్చనని చెప్పారు. అలాగే ఇంట్లో వాళ్లకు ఇవ్వాల్సిన స్పేస్, కావాల్సిన ఫ్రీడమ్ ఉంటాయని, కోడళ్లు ఇలాగే ఉండాలన్న పట్టింపులేమీ తనకు లేవని అమల చెప్పారు. నా కోడళ్లు ఎల్లప్పుడూ నాతోనే ఉండాలన్న నిబంధనలేవీ పెట్టను. వాళ్లు తమతమ రంగాల్లో రాణిస్తున్నారు. అలా వాళ్లు బిజీగానే ఉంటున్నారు. అంతేకానీ నాకు ప్రత్యేకంగా టైమ్ కేటాయించాలని కోరుకోను. ఇలాగే ఉండాలని డిమాండ్ కూడా చేసే అత్తను నేను కాదు. భార్యగానూ ఏనాడు అలాంటి డిమాండ్లు ఏమీ నాకు లేవు. కానీ టైమ్ దొరికినప్పుడు మాత్రం అందరం సరదాగా గడుపుతాం. ఆ కొద్ది సమయాన్ని నేను చాలా ఎంజాయ్ చేస్తాను. అని అమల చెప్పుకొచ్చారు. దీంతో తన కోడళ్లలో అమల తన కోడళ్లతో చాలా ఫ్రెండ్లీగా ఉంటారని, అత్తా - కోడళ్ల రిలేషన్ ఇంతే హెల్దీగా ఉండాలని నెటిజన్లు ప్రశంసిస్తున్నారు. అయితే పిల్లల పెంపకం విషయంలో మాత్రం అమె చాలా స్ట్రిక్ట్ గా ఉండేవారట. తప్పు చేస్తే అస్సలు ఊరుకునే వారు కాదట. కాగా, అమల 1992లో నాగార్జునను వివాహం చేసుకున్నారు. వీరికి కుమారుడు అఖిల్ ఉన్నారు. తమ పెళ్లికి ముందు నాగ్- అమల కలిసి పలు సినిమాల్లో నటించారు. ఇక నాగార్జున తొలి భార్య లక్ష్మీ దగ్గుబాటి కుమారుడు నాగచైతన్య అని అందరికి తెలిసిందే!




## 'సంతాన ప్రాప్తిరస్తు' కొత్త ప్రోమో చూశారా? అన్ లిమిటెడ్ నవ్వులు




టాలీవుడ్ యువ నటీనటులు విక్రాంత్, చాందినీ చౌదరి లీడ్ రోల్స్ లో రూపొందుతున్న మూవీ సంతాన ప్రాప్తిరస్తు. యూత్ ఫుల్ ఫ్యామిలీ ఎంటర్టైనర్ గా తెరకెక్కుతున్న ఆ సినిమాలో ప్రముఖ కమెడియన్ వెన్నెల కిషోర్ కీలక పాత్ర పోషిస్తున్నారు. తరుణ్ భాస్కర్, అభినవ్ గోమటం, మురళీధర్ గౌడ్ ముఖ్య పాత్రల్లో కనిపించనున్నారు. సంజీవ్ రెడ్డి దర్శకత్వం వహిస్తున్న సంతాన ప్రాప్తిరస్తు మూవీని మధుర ఎంటర్టైన్మెంట్, నిర్వి ఆర్ట్స్ బ్యానర్లపై మధుర శ్రీధర్ రెడ్డి, నిర్వి హరిప్రసాద్ రెడ్డి నిర్మిస్తున్నారు. కొన్ని రోజుల క్రితం మొత్తం షూటింగ్ ను పూర్తి చేసిన మేకర్స్.. ఇప్పుడు పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుపుతున్నారు. అవి కూడా మరికొద్ది రోజుల్లో పూర్తి చేయనున్నారు. బాలల దినోత్సవం కానుకగా నవంబర్ 14వ తేదీన సినిమాను రిలీజ్ చేయనున్నారు. ఆ విషయాన్ని రీసెంట్ గా అనౌన్స్ చేసిన విషయం తెలిసిందే. ఎంటర్టైన్మెంట్ డోస్ కు రెడీ అవ్వండంటూ క్యాప్షన్ ఇచ్చిన మేకర్స్.. మీ దగ్గరలో ఉన్న థియేటర్స్ లో అపాయింట్మెంట్ బుక్ చేసుకోమని సరదాగా పిలుపునిచ్చారు. ఫన్నీ పోస్టర్ ను కూడా రిలీజ్ చేశారు. తాజాగా రిలీజ్ డేట్ ప్రోమో విడుదల చేశారు మేకర్స్. లవ్, తక్కువ వీర్యకణాల సంఖ్య, హై డ్రామా, అన్ లిమిటెడ్ నవ్వులు.. ప్రేమ సంతానోత్పత్తి గురించి కాదు... భావాల గురించి నిరూపించే రొమాంటిక్- కామ్ అంటూ రాసుకొచ్చారు. ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ గా మారిన రిలీజ్ ప్రోమో అందర్నీ ఆకట్టుకుంటోంది. ప్రస్తుత సమాజంలో యూత్ కపుల్స్ ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల్లో ఒక దానిని తీసుకుని సినిమా తీస్తున్నట్లు ఇప్పటికే క్లారిటీ ఇవ్వగా.. మేకర్స్ రిలీజ్ ప్రోమోతో మరింత స్పష్టత ఇచ్చారు. ప్రోమో ప్రకారం, హైదరాబాద్ లో హీరో సాఫ్ట్ వేర్ ఎంప్లాయ్ గా వర్క్ చేస్తుంటారు. ఆ సమయంలో ఫుల్ చిల్ అవుతూ ఎంజాయ్ చేస్తారు. ఆ తర్వాత హీరోయిన్ ను పెళ్లి చేసుకుంటారు. కానీ పిల్లలు కనే టైమ్ లో సమస్య వస్తుంది. దీంతో డాక్టర్ ను ఆశ్రయించగా.. స్పెర్మ్ కౌంట్ తక్కువ అని చెబుతారు. దీంతో వంద రోజుల్లో ప్రెగ్నెంట్ చేయాలని అనుకుంటారు. అప్పుడే వెన్నెల కిషోర్ హీరోకు కొన్ని టిప్స్ ఇస్తారు. మరి చివరకు ఏమైంది? హీరో అనుకున్న సాధించారా? అనేది మూవీగా ప్రోమో ద్వారా తెలుస్తోంది. ఇప్పటికే సినిమాపై ఆడియన్స్ లో మంచి అంచనాలు ఉన్నాయి. పోస్టర్లు, ప్రోమోలు అన్నీ సూపర్ రెస్పాన్స్ అందుకున్నాయి. సినిమాపై పాజిటివ్ బజ్ క్రియేట్ చేశాయి. మూవీ క్లిక్ అవుతుందనే హోప్స్ క్రియేట్ చేశాయి. ఇప్పుడు తాజాగా ప్రోమో వాటిని మరింత పెంచింది. మరి సంతాన ప్రాప్తిరస్తు మూవీ ఎలా ఉంటుందో వేచి చూడాలి.

## రేసులో ఉన్నానంటూ పోస్టర్ తో చెప్పేశాడుగా..!



చార్మింగ్ స్టార్ శర్వానంద్ స్ట్రగులింగ్ ఇంకా కొనసాగుతూనే ఉంది. మనమే తర్వాత శర్వానంద్ కాస్త గ్యాప్ తో 3 సినిమాలు చేస్తున్నట్టు ప్రకటించాడు. అందులో నారి నారి నడుమ మురారి సినిమాతో రాబోతున్నాడు. సామజవరగమన సినిమాతో సూపర్ హిట్ అందుకున్న డైరెక్టర్ రామ్ అబ్బరాజు డైరెక్షన్ లో తెరకెక్కిన ఈ సినిమా ఒక మంచి ఫ్యామిలీ ఎంటర్టైనర్ గా రాబోతుంది. ఏకె ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్ లో అనీల్ సుంకర ఈ సినిమా నిర్మిస్తున్నారు. ఐతే శర్వానంద్ నారి నారి నడుమ మురారి సినిమా రిలీజ్ అనౌన్స్ మెంట్ వచ్చింది.

**సామజవరగమన తో ఫ్యామిలీ ఎంటర్టైనర్ గా..** దీపావళి రోజు రిలీజ్ పోస్టర్ తో సర్ ప్రైజ్ చేశారు శర్వానంద్ అండ్ టీం. శర్వానంద్, రామ్ అబ్బరాజు కాంబోలో వస్తున్న నారి నారి నడుమ మురారి సినిమా ఈసారి సంక్రాంతి రేసులో రిలీజ్ అవుతుంది. ఆల్రెడీ సంక్రాంతికి రిలీజ్ లు ఉన్నా తన సినిమాతో పోటీకి సై అనేస్తున్నాడు శర్వానంద్. నారి నారి నడుమ మురారి సినిమాలో సంయుక్త మీనన్, సాక్షి వైద్య హీరోయిన్స్ గా నటిస్తున్నారు. సామజవరగమన తో ఫ్యామిలీ ఎంటర్టైనర్ గా సూపర్ హిట్ అందుకున్న రామ్ అబ్బరాజు మళ్లీ అదే ఫ్యామిలీ ఎంటర్టైనర్ గా నారి నారి నడుమ మురారితో వస్తున్నాడు. ఐతే సంక్రాంతి రేసులో మెగాస్టార్ మన శంకర వరప్రసాద్, రవితేజ కిషోర్ తిరుమల మూవీ, ప్రభాస్ రాజా సాబ్ తో పాటు నవీన్ పొలిశెట్టి అనగనగా ఒకరాజు ఉన్నాయి. ఇప్పుడు నారి నారి నడుమ మురారితో శర్వానంద్ కూడా సంక్రాంతికే వస్తా అంటున్నాడు.

**పొంగల్ కి ఫ్యామిలీ అంతా కలిసి చూసే సినిమా..** సంక్రాంతికి వచ్చే ఫ్యామిలీ మూవీస్ అన్నీ కూడా ఆడియన్స్ ని బాగా ఎంటర్టైన్ చేస్తాయి. పొంగల్ కి ఫ్యామిలీ అంతా కలిసి చూసే సినిమా వస్తే అది సూపర్ హిట్ అన్నట్టే.

అందుకే ఈసారి సంక్రాంతికి అన్నీ కూడా ఎంటర్టైనర్స్ నే దించుతున్నారు. రాజా సాబ్ వస్తే అదొక్కటే థ్రిల్లర్ కానీ మిగతా సినిమాలన్నీ కూడా ఫన్ అండ్ ఎంటర్టైనింగ్ కథలతోనే వస్తున్నాయి. వారిలో శర్వానంద్ నారి నారి నడుమమురారి కూడా వస్తుంది. ఆల్రెడీ సామజవరగమన తో సత్తా చాటిన డైరెక్టర్ రామ్ అబ్బరాజు ఈసారి రెండో అటెంప్ట్ తో కూడా అదే రేంజ్ సక్సెస్ అందుకోవాలని చూస్తున్నాడు. శర్వానంద్ కూడా పొంగల్ కి తన సినిమాతో సత్తా చాటి హిట్ ట్రాక్ ఎక్కాలని చూస్తున్నాడు. ఇక ఈ సినిమాతో పాటు రేసింగ్ బ్యాక్ డ్రాప్ లో ఒక సినిమా.. సంపత్ నందితో భోగి అని మరో సినిమా చేస్తున్నాడు. ఈ సినిమాలతో శర్వానంద్ ఎలాగైనా సూపర్ కంబ్యాక్ ఇవ్వాలని చూస్తున్నాడు.

## శ్రీలీల లేడీ ఓరియేంటెడ్ అతడితోనా?

తెలుగు అమ్మాయి శ్రీలీల రూటు మార్చిందా? భవిష్యత్ కెరీర్ ని పక్కాగా ప్లాన్ చేసుకుంటుందా? అంటే సన్నివేశం అలాగే కనిపిస్తోంది. నిన్న మొన్నటి వరకూ తెలుగు సినిమాలతో బిజీగా ఉన్న అమ్మడు ఒక్కసారిగా వాటిని పక్కన బెట్టిన వైనం తెలిసిందే. టాలీవుడ్ కంటే పరభాషలకే అమ్మడు పెద్ద పీట వేసింది. ఈ క్రమంలోనే బాలీవుడ్ కి వెళ్లింది. టాలీవుడ్ లో అగ్ర హీరోలతో అవకాశాల కన్నా బాలీవుడ్ లో కుర్ర హీరోలు ఉత్తమం అనుకుని ప్రయాణాన్ని ముందుకు తీసుకెళ్తుంది. ఇప్పటికే అక్కడ రెండు..మూడు సినిమాలు కమిట్ అయిన సంగతి తెలిసిందే.

**స్టార్ లీగ్ లో చేరకుండానే:** అలాగే కన్నడ, తమిళ చిత్ర దర్శక, నిర్మాతలకు సొగసరి రెగ్యులర్ గా టచ్ లో ఉంటుంది. తెలుగు దర్శక, నిర్మాతలు తనకు టచ్ లో ఉన్నా? శ్రీలీల మాత్రం ఇతర భాషలకు టచ్ లో ఉండటం ఇంట్రెస్టింగ్. ఇటీవలే ఓ లేడీ ఓరియేంటెడ్ సినిమా చేస్తున్నట్లు కూడా ప్రకటించింది. కానీ వాస్తవానికి శ్రీలీలకు ఇంకా సోలోగా సత్తా చాటే స్టామినా లేదు. హీరోయిన్ గా ఇప్పుడిప్పుడే ఎదుగుతోంది. ఇంకా స్టార్ హీరోయిన్ల జాబితాలో చేరలేదు. అయినా సరే ఆ ఇమేజ్ తో



సంబంధం లేకుండా లేడీ ఓరియేంటెడ్ చిత్రాలకు ఒకే చెప్పింది? అంటే శ్రీలీల ఆలోచనలు ఎలా ఉన్నాయి? అన్నది అద్దం పడుతుంది.

**తమిళ్ డైరెక్టర్ తో ప్రయత్నమా?...** తనకు తానుగా స్వయంగా ఎదిగే ఆలోచన తనలో కనిపిస్తోంది. కేవలం స్టార్ హీరోల సరసన నటిస్తే వచ్చే ఇమేజ్ తో పని లేకుండా తనకు తానుగా సోలోగా ఎదగాలి అన్న తపన అమ్మడిలో కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో ఉమెన్ సెంట్రి క్ చిత్రాన్ని లాక్ చేసింది. అయితే ఈ సినిమాకు దర్శకుడు ఎవరు? అన్నది ఇంత వరకూ క్లారిటీ లేదు.

ఈ నేపథ్యంలో ఆ బాధ్యతలు తమిళ డైరెక్టర్ మిలింద్ రాజ్ తీసుకున్నట్లు వార్తలొస్తున్నాయి. గతంలో ఇతడు కాదల్ టూ కల్యాణం, అవల్, నెట్రికన్ ,ది విలేజ్ లాంటి చిత్రాలు డైరెక్ట్ చేసాడు. డైరెక్టర్ గా ఈ సినిమాలకు అతడికి మంచి పేరు తీసుకొచ్చాయి.

**క్లారిటీ వచ్చేదెప్పుడు?...** అందులో ది విలేజ్ అన్నది హారర్ చిత్రం. మంచి విజయం సాధించింది. మిగతా మూడు వేర్వేరు జానర్ చిత్రాలు. వాటి రిలీజ్ తర్వాత డైరెక్టర్ గా మాత్రం మిలింద్ బిజీ కాలేదు. పదేళ్ల కెరీర్ లో నాలుగు సినిమాలకే పరిమిత మయ్యారు. అలాంటి డైరెక్టర్ని శ్రీలీల తెరపైకి తీసుకు రావడం విశేషం.

ఈ నేపథ్యంలో మిలింద్- శ్రీలీల కాంబినేషన్ లో వచ్చేది హారర్ థ్రిల్లర్ చిత్రమా? లేక మరో జానరా? అన్నది ఆసక్తికరంగా మారింది. ప్రస్తుతం ప్రాజెక్ట్ డిస్కషన్ స్టేజ్ లో ఉందని మాత్రమే శ్రీలీల తెలిపింది. డైరెక్టర్ ఎవరు? అన్నది కూడా అధికారికంగా ప్రకటించలేదు. దీనిపై త్వరలోనే క్లారిటీ వచ్చే అవకాశం ఉంది.

## కీర్తి సురేష్ బయోపిక్ టైటిల్ అది పెట్టాలట..!

మహానటి సినిమాతో తనలోని మహానటిని ప్రేక్షకులకు పరిచయం చేసి అవార్డులను సైతం అందుకుంది కీర్తి సురేష్. మలయాళంలో మంచి నటిగా గుర్తింపు తెచ్చుకున్న కీర్తి సురేష్ తెలుగు, తమిళ భాషల్లో సినిమాలు చేస్తూ స్టార్ క్రేజ్ తెచ్చుకుంది. లాస్ట్ ఇయర్ బేబీ జాన్ సినిమాతో బాలీవుడ్ ఎంట్రీ కూడా ఇచ్చింది కీర్తి సురేష్. ఇక రీసెంట్ గా అమ్మడు ఒక ఇంటర్వ్యూలో తన బయోపిక్ తీస్తే ఎలాంటి టైటిల్ పెట్టాలో చెప్పింది. సీనియర్ యాక్టర్ జగపతి బాబు హోస్ట్ గా ఒక స్పెషల్ చిట్ చాట్ షో నిర్వహిస్తున్నారు.

**పెళ్లి తర్వాత కీర్తి సురేష్..** ఈ చిట్ చాట్ లో ఇప్పటికే చాలామంది స్టార్స్ అటెండ్ అయ్యారు. రీసెంట్ గా కీర్తి సురేష్ కూడా ఆ షోకి వచ్చింది. షోలో జగ్గు భాయ్ ప్రశ్నలకు కీర్తి సురేష్ తెలివైన సమాధానాలు ఆడియన్స్ ని అలరించాయి. ఇక ఈ క్రమంలో సావిత్రి గారి బయోపిక్ మహానటిలో నువ్వు చేశావ్.. నీ బయోపిక్ చేస్తే దానికి ఏ టైటిల్ పెట్టాలని నువ్వు అనుకుంటున్నావ్ అంటే కాస్త



ఆలోచించి ప్రసిద్ధి అని చెప్పింది కీర్తి. అంటే తన పేరులోని కీర్తి ప్రతిష్ట ప్రసిద్ధి ఇలా వాటికి సూటయ్యేలా టైటిల్ ఎంపిక చేసుకుందన్నమాట. కీర్తి సురేష్ బయోపిక్ చేస్తే కచ్చితంగా ఆ టైటిల్ పెట్టినా డౌట్ పడనక్కర్లేదు. ఈమధ్య కెరీర్ లో కాస్త వెనకపడింది కీర్తి సురేష్. పెళ్లి తర్వాత ఈ బ్రేక్ కామనే అయితే మళ్లీ తిరిగి ఫాం లోకి రావాలని చూస్తుంది అమ్మడు.

**విజయ్ దేవరకొండతో రౌడీ జనార్ధన్..** ప్రస్తుతం తెలుగులో విజయ్ దేవరకొండతో రౌడీ జనార్ధన్ తో పాటుగా వేణు యెల్దండి ఎల్లమ్మ సినిమాలో కూడా కీర్తి సురేష్ నటిస్తుంది. ఈ రెండు సినిమాలతో అమ్మడు మళ్లీ తన సత్తా చాటాలని చూస్తుంది. కీర్తి సురేష్ కూడా తన ఫోకస్ అంతా ఇప్పుడు ఈ రెండు సినిమాల మీదే పెట్టింది. తమిళ్ లో సినిమాలు కాస్త తగ్గాయి కాబట్టి అవకాశం ఇస్తున్న తెలుగు లో మళ్లీ రాణించాలని చూస్తుంది అమ్మడు. ఎలాంటి పాత్ర ఇచ్చినా దానికి నూటికి నూరు పాళ్లు న్యాయం చేస్తున్న కీర్తి సురేష్. ఆఫ్టర్ మ్యారేజ్ కూడా తన సత్తా చాటాలని చూస్తుంది. ఐతే ప్రస్తుతం కమిటైన సినిమాలతో కీర్తి సురేష్ చాలా కాన్ఫిడెంట్ గా ఉంది. ఓ పక్క కమర్షియల్ సినిమాలు చేస్తూ ఫిమేల్ సెంట్రిక్ సినిమాలు చేసిన కీర్తి సురేష్. మళ్లీ లేడీ ఓరియెంటెడ్ కథలను కూడా టచ్ చేయాలని చూస్తుంది. ఐతే పూర్తిగా అలాంటి సినిమాలే కాకుండా కమర్షియల్ సినిమాలతో ఆడియన్స్ ని అలరించాలని ఫిక్స్ అయ్యింది. వేణుతో చేస్తున్న ఎల్లమ్మ సినిమాలో కీర్తి సురేష్ రోల్ సర్ ప్రైజ్ చేస్తుందని అంటున్నారు.




హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలోని అన్ని రహదారులపై ఉన్న రవాణా చెక్ పోస్టులను వెంటనే ఎత్తివేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంచలన ఆదేశాలిచ్చారు. దీంతో తక్షణమే ఈ నిర్ణయాన్ని అమలు చేస్తున్నట్లు రవాణా శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈరోజు (బుధవారం) సాయంత్రం 5 గంటల్లోగా మూసివేతపై పూర్తి నివేదికను ఇవ్వాలని సంబంధిత అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. సీఎం రేవంత్ ఆదేశాలతో తక్షణమే చెక్‌పోస్టుల కార్యకలాపాలు నిలిపివేయాలని ట్రాన్స్? పోర్ట్ కమిషనర్ ఆకస్మిక, తక్షణ ఆదేశాలు జారీ చేశారు. చెక్ పోస్టుల వద్ద ఉన్న సిబ్బందిని వెంటనే వేరే బాధ్యతల్లో వినియోగించుకోవాలని ఉత్తర్వులు ఇచ్చారు. ఇవాళ సాయంత్రం 5గంటల నుంచి రాష్ట్రంలోని అన్ని చెక్ పోస్టులను రద్దు చేస్తున్నట్టు రవాణాశాఖ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. అక్రమ రవాణాను అడ్డుకునేందుకు ఏర్పాటు చేసిన రవాణాశాఖ చెక్‌పోస్టుల్లో అవినీతి రవాణా అవుతోంది. కొందరు అధికారులు ప్రైవేటు సిబ్బందిని పెట్టుకుని యథేచ్ఛగా అక్రమ వసూళ్లు కొనసాగిస్తున్నారు. రాష్ట్రంలోని రవాణాశాఖ చెక్‌పోస్టులను రద్దు చేస్తూ జులై ఆఖరి వారంలోనే రాష్ట్ర మంత్రివర్గం కీలక నిర్ణయం తీసుకుంది. నెలరోజులు ఆలస్యంగా జీఓ జారీ అయ్యింది. ఉత్తర్వులు వచ్చి దాదాపు రెండు నెలలు గడుస్తున్నా చెక్‌పోస్టులను ఇంకా తొలగించలేదు. జీఎస్టీ అమల్లోకి వచ్చాక చెక్‌పోస్టుల అవసరం దాదాపుగా తగ్గింది. కేంద్రం సూచనల మేరకు దేశంలోని అనేక రాష్ట్రాలు సంవత్సరాల క్రితమే చెక్‌పోస్టులను రద్దు చేశాయి. కానీ తెలంగాణలో కొనసాగుతున్నాయి.

ఏడాదిన్నర క్రితమే తెలంగాణలో చెక్‌పోస్టుల రద్దుకు రవాణాశాఖ నిర్ణయం తీసుకున్నా.. కొందరు అధికారుల బలమైన ఒత్తిళ్ల కారణంగా ఇన్నాళ్లు ఆ నిర్ణయం వాయిదా పడుతూ వచ్చింది. ఎట్టకేలకు రెండు నెలల క్రితం జీఓ జారీ అయినా అవినీతి అధికారుల తీరు మారలేదు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని అన్ని చెక్‌పోస్టులు రద్దు చేయాలని రవాణాశాఖ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు.




## ఆవిష్కరణలు, పెట్టుబడులను ప్రోత్సహిస్తున్నాం: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

రాయదుర్గం (హైదరాబాద్): సైన్స్, సాంకేతిక, అంతరిక్ష రంగాలకు హైదరాబాద్ నగరం కేంద్రంగా నిలుస్తోందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. రాయదుర్గం జేఆర్‌సీ కన్వెన్షన్ సెంటర్‌లో గ్లోబల్ ఈవెంట్స్ ఆఫ్ పయనీరింగ్ అండ్ అడ్వాన్సింగ్ క్వెస్ట్ (జియో ప్యాక్) ఆధ్వర్యంలో బయో ఇన్‌స్పైర్డ్ ఫ్రాంటియర్స్-2025 సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. తొలి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ శాస్త్ర, సాంకేతిక రంగాలకు చెందిన పరిశోధన సంస్థలు, పరిశ్రమలు హైదరాబాద్‌లో స్థాపించి బీజం వేశారని అన్నారు. నాటి నుంచి బీడీఎల్, డీఆర్‌డీవో, రిమోట్ సెన్సింగ్ ఏజెన్సీ తదితర ప్రఖ్యాత సంస్థలు అభివృద్ధి చేస్తూ వస్తున్నారని చెప్పారు. ఈ క్రమంలో నగరంలో ఐఐటి, ట్రిపుల్ ఐటీ, హెచ్‌సీయూ, ఉస్మానియా యూనివర్సిటీ వంటి విద్యా సంస్థలు శాస్త్ర సాంకేతిక రంగాలకు దన్నుగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. హైదరాబాద్‌లో ఫార్మా, ఐటీ, రక్షణ వంటి అనేక రకాల క్లస్టర్స్‌లో పరిశ్రమలు ఏర్పాటయ్యాయన్నారు. అంతరిక్షరంగంలోనూ క్లస్టర్ ఏర్పాటు చేసి ఆ ఇండస్ట్రీని ప్రోత్సహిస్తామని పేర్కొన్నారు.

ప్రభుత్వం స్పేస్ టెక్నాలజీలో ఆవిష్కరణలు, పెట్టుబడులను ప్రోత్సహిస్తోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జియో ప్యాక్ సీఈఓ, వ్యవస్థాపకుడు ముర్తజ కురసాని తదితరులు పాల్గొన్నారు.

## ఉస్మానియా నూతన ఆసుపత్రి నిర్మాణం రెండేళ్లలో పూర్తి చేయాలి: సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్: ఉస్మానియా నూతన ఆసుపత్రి నిర్మాణం రెండేళ్లలో పూర్తి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఉస్మానియా నూతన ఆసుపత్రి భవన నిర్మాణ పనుల పురోగతిపై సీఎం సమీక్షించారు.

నూతన ఆసుపత్రి అవసరాలకు తగినట్లు అధునాతన వైద్య పరికరాలను సమకూర్చుకోవడానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అధునాతన పరికరాల ఏర్పాటుకు తగినట్లు గదులు, ల్యాబ్‌లు, ఇతర నిర్మాణాలు ఉండాలని ఇంజినీరింగ్ అధికారులకు సీఎం సూచించారు. ఆసుపత్రి నిర్మాణ పనులతో పాటు స్థానికులకు ఇబ్బంది లేకుండా చుట్టూ రోడ్ల నిర్మాణం చేపట్టాలన్నారు. నిర్మాణ పనులు వేగవంతం చేయడానికి వైద్యారోగ్య శాఖ, పోలీసు, జీహెచ్ఎంసీ, ఆర్అండ్‌బీ, విద్యుత్ శాఖ అధికారులతో సమన్వయ కమిటీని ఏర్పాటు చేయాలని సీఎం ఆదేశించారు.

ఈ కమిటీ క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ పది రోజులకోసారి సమావేశమై ఏవైనా సమస్యలుంటే పరిష్కరించుకుంటూ పనులు వేగంగా జరిగేలా చూడాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.




## జూబ్లీహిల్స్ బైపోల్.. రంగంలోకి గులాబీ బాస్

హైదరాబాద్, అక్టోబర్ 22: జూబ్లీహిల్స్ ఉపఎన్నికపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ దృష్టిసారించారు. గులాబీ పార్టీ ముఖ్యనేతలు, జూబ్లీహిల్స్ బైపోల్స్ ఇంచార్జ్‌లకు కేసీఆర్ పిలుపునిచ్చారు. రేపు (గురువారం) ఫాంహౌస్‌లో పార్టీ నేతలతో గులాబీ బాస్ కీలక సమావేశం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఉపఎన్నిక ప్రచారంపై నేతలకు కేసీఆర్ దిశానిర్దేశం చేయనున్నారు. ఇప్పటికే 40 మందితో స్టార్ క్యాంపెయినర్లను ప్రకటించింది బీఆర్ఎస్. అయితే జూబ్లీహిల్స్ బైపోల్స్ ప్రచారంలో కేసీఆర్ పాల్గొనటంపై సందిగ్ధత నెలకొంది. సిట్టింగ్ సీటును తిరిగి దక్కించుకోవటమే లక్ష్యంగా కేసీఆర్ ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. కాగా.. మాగంటి గోపీనాథ్ మరణంతో జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఉప ఎన్నిక అనివార్యమైన విషయం తెలిసిందే. సిట్టింగ్ స్థానాన్ని ఎలాగైన కైవసం చేసుకోవాలని పట్టుదలతో ఉంది బీఆర్ఎస్ పార్టీ. అందుకు తగ్గ ప్రణాళిలను కూడా సిద్ధం చేసింది. ఇప్పటికే జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో జోరుగా ప్రచారం నిర్వహిస్తోంది గులాబీ పార్టీ. బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా మాగంటి గోపీనాథ్ సతీమణి మాగంటి సునీతకే టికెట్ ఇచ్చింది బీఆర్ఎస్. మాగంటి సునీత ప్రచారంలో దూసుకెళ్తున్నారు. ఎక్కడికక్కడ ర్యాలీలో, సభలు నిర్వహిస్తున్నారు. మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్‌రావు, బీఆర్ఎస్ ముఖ్య నేతలు ప్రచారంలో పాల్గొని బీఆర్ఎస్‌ను గెలిపించాలని కోరుతున్నారు. మరోవైపు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికను కాంగ్రెస్, బీజేపీ పార్టీలు కూడా ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. ఈ ఉపఎన్నికల్లో గెలుపు తమదే అంటూ కాంగ్రెస్ ధీమా వ్యక్తం చేస్తుండగా.. బైపోల్‌లో విజయం తమనే వరిస్తుందని బీజేపీ ఆశాభావం వ్యక్తం చేస్తోంది. కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్, బీజేపీ అభ్యర్థి లంకల దీపక్ రెడ్డి జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో గెలుపే లక్ష్యంగా విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. మరి ఈ మూడు పార్టీల్లో జూబ్లీహిల్స్ నియోజకవర్గ ప్రజలు ఎవరికి పట్టంకట్టనున్నారో చూడాలి మరి.

## షోరూమ్‌లోనే వాహనాల రిజిస్ట్రేషన్.. పరిశీలిస్తున్నాం: మంత్రి పొన్నం




హైదరాబాద్: ఢిల్లీలో కాలుష్యం ఎలా ఉందో అందరం చూస్తూనే ఉన్నామని.. అలాంటి పరిస్థితులు హైదరాబాద్‌లో రాకుండా ప్రణాళికలు చేపట్టినట్లు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఖైరతాబాద్ రవాణా శాఖ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. "రవాణాశాఖ కార్యాలయాల్లో మధ్యవర్తులు లేకుండా చేస్తాం. ఈ శాఖలో ఏఐ వినియోగాన్ని మరింత పెంచాలని నిర్ణయించాం. ఎలక్ట్రిక్ వాహనాలపై రూ.577 కోట్ల పన్ను మినహాయింపు ఇచ్చాం. దీంతో ఆ వాహనాల విక్రయాలు 0.03 శాతం నుంచి 1.30 శాతానికి పెరిగాయి. వాహన సారథి పోర్టల్‌ను పూర్తిగా అందుబాటులోకి తెచ్చాం. రాష్ట్రంలో వాహనాల సంఖ్య 1.70 కోట్లకు చేరింది. షోరూమ్‌లోనే వాహనాల రిజిస్ట్రేషన్ చేసే అంశంపై ఆలోచన చేస్తున్నాం. ప్రజలు సహకరిస్తేనే.. ట్రాఫిక్ కష్టాలు, కాలుష్యం తగ్గుతుంది" అని మంత్రి పొన్నం అన్నారు.




హైదరాబాద్: సృష్టి ఫెర్టిలిటీ కేసులో ఈడీ విచారణ చేపట్టింది. ఈ కేసులో నిందితులు డాక్టర్ నమ్రత, కల్యాణి, నందిని, సంతోషి, జయంత్‌కృష్ణను కోర్టు అనుమతితో అధికారులు విచారిస్తున్నారు. ప్రస్తుతం నిందితులు చంచల్‌గూడ జైలులో ఉండటంతో వారందరినీ అక్కడే విచారించేందుకు ఈడీకి కోర్టు అనుమతించింది. ఈ నెల 28 వరకు నిందితులను దర్యాప్తు బృందం ప్రశ్నించనుంది. తొలుత సృష్టి ఫెర్టిలిటీ వ్యవహారంలో గోపాలపురం పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. అనంతరం కేసు దర్యాప్తునకు సిట్ ఏర్పాటు చేశారు. ఆ తర్వాత ఈడీ కూడా రంగంలోకి దిగింది. నిందితులంతా భారీగా ఆస్తులు కూడబెట్టినట్టు గుర్తించిన అధికారులు సోదాలు కూడా నిర్వహించారు. సోదాల్లో నిందితులు భారీగానే ఆస్తులు కలిగి ఉన్నట్లు ఈడీ గుర్తించింది. తనిఖీల సమయంలో కీలకమైన దస్త్రాలు కూడా స్వాధీనం చేసుకుంది.

అయితే కోర్టు నిందితులను విచారించేందుకు అనుతించడంతో వారికి మంగళవారం ఈడీ నోటీసులు జారీ చేసింది. నేటి నుంచి ఈ నెల 28 వరకు నిందితులను జైలులోనే విచారించనున్నారు.

## రాజకీయ లబ్ధి కోసమే బస్తీ దవాఖానాలపై తప్పుడు ప్రచారం: మంత్రి దామోదర రాజనర్సింహ



హైదరాబాద్: బస్తీ దవాఖానాలపై రాజకీయ లబ్ధి కోసమే కొందరు ప్రజాప్రతినిధులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని తెలంగాణ వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆగ్రహం వ్యక్తం చేశారు. భారత రాష్ట్ర సమితి నేతలు హరీశ్ రావు, కేటీఆర్ బస్తీ దవాఖానాలను సందర్శించి వసతులు, ఔషధాలు లేవంటూ చేసిన వ్యాఖ్యలపై ఆయన మండిపడ్డారు. ప్రజాప్రతినిధులే తప్పుడు ప్రచారం చేస్తూ ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల్లో నమ్మకం సన్నగిల్లేలా చేయడం దురదృష్టకరమన్నారు. బస్తీ దవాఖానాల ద్వారా 134 రకాల వైద్య పరీక్షలను ఉచితంగా అందిస్తున్నామని.. నిత్యం 45 వేల మందికి సేవలు అందుతున్నాయని చెప్పారు. అన్ని చోట్ల వైద్యులతో పాటు మందులు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ప్రైవేటు ఆసుపత్రులకు లబ్ధి చేకూర్చేలా కొందరు ప్రజాప్రతినిధులు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. అలాంటి వారికి సరైన సమయంలో ప్రజలే మరోసారి గుణపాఠం చెబుతారన్నారు.



## కాటేదాన్‌లో స్కూల్ బస్సులో మంటలు

హైదరాబాద్: నాదర్‌గుల్‌లోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌కు చెందిన బస్సులో మంటలు వ్యాపించాయి. పొగలు రావడంతో వెంటనే అప్రమత్తమైన డ్రైవర్ బస్సును ఆపి దిగిపోయారు. ఆ తర్వాత బస్సు పూర్తిగా దగ్ధమైంది. విద్యార్థులను ఇళ్ల వద్ద దింపి వెళ్తుండగా కాటేదాన్ వద్ద ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఘటన జరిగిన సమయంలో బస్సులో విద్యార్థులు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని మంటలను ఆర్పివేశారు.

## యాదగిరిగుట్టలో విశేష పూజలు.. గిరి ప్రదక్షిణ




యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో బుధవారం విశేష పూజలు నిర్వహించారు. కార్తిక మాసం మొదటి రోజు, స్వామివారి జన్మనక్షత్రం స్వాతి నక్షత్రం రోజు కావడంతో ఆలయంలో 108 కలశాలతో పాంచరాత్ర ఆగమశాస్త్రం ప్రకారం శత ఘటాభిషేక పూజలు చేశారు. కలశాలలో వివిధ ఫల రసాలు, పంచామృతాలు, శుద్ధజలంతో స్వామి, అమ్మవార్లను అభిషేకించారు. అంతకుముందు పెద్దఎత్తున భక్తులు, స్థానికులు గిరి ప్రదక్షిణ చేపట్టారు. ఈ వేడుకల్లో ఆలయ అర్చకులు, వేదపండితులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు. గిరి ప్రదక్షిణలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, జిల్లా కలెక్టర్ హనుమంతరావు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.




## ఒక్క రోజులోనే రూ.6వేలు తగ్గిన బంగారం ధర

హైదరాబాద్: బంగారం ధర భారీగా తగ్గింది. హైదరాబాద్‌లో 24 క్యారెట్ల నాణ్యమైన 10 గ్రాముల పసిడి ధర రూ.1,28,150కి చేరుకుంది. 22 క్యారెట్ల నాణ్యమైన 10 గ్రాముల బంగారం ధర రూ.1,17,500కు చేరుకుంది. కిలో వెండి ధర రూ.1,65,000కు చేరుకుంది. మంగళవారంతో పోలిస్తే 10 గ్రాముల బంగారం ధర సుమారు రూ.6 వేలు తగ్గింది. ఇటీవల రికార్డు గరిష్ఠాలకు చేరిన బంగారం, వెండి లోహాల్లో మదుపర్లు లాభార్జనకు దిగడం, అమెరికా డాలర్ బలోపేతం కావడం, అంతర్జాతీయంగా ఉద్రిక్తతలు కాస్త ఉపశమించడం ఇందుకు కారణమని బులియన్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. మరోవైపు విజయవాడలో 24 క్యారెట్ల నాణ్యమైన 10 గ్రాముల బంగారం ధర రూ.1,27,200కు చేరుకుంది. 22 క్యారెట్ల నాణ్యమైన 10 గ్రాముల బంగారం ధర రూ.1,16,600కు చేరుకుంది. కిలో వెండి ధర రూ.1,62,000కు చేరుకుంది.

Printed, Published and owned by VISHWANATH V and Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com